Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 140 మేడ్చల్ మల్కాజ్‌గిరి 11 జూన్ 2023 ఆదివారం పేజీలు : 4

## 23 ఔషధాల ధరల స్థిరీకరణ

న్యూఢిల్లీ : మొత్తం 23 ఔషధాల ధరల్ని తాజాగా స్థిరీకరించామని జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ(ఎన్‌పీపీఏ) ప్రకటించింది. వీటిలో మధుమేహం, అధిక రక్తపోటుకు సంబంధించిన ఔషధాలూ ఉన్నాయి. "గ్లైక్లజైడ్ ఈఆర్, మెట్‌ఫార్మిన్ హైడ్రోక్లోరైడ్ గోలీల ధరను రూ. 10.03గా, టెల్మిసార్టన్, క్లోర్తలిడన్-సిల్నిడిపైన్ గోలీల ధర రూ.13.17, ట్రిప్సిన్, బ్రొమిలైన్, రుటోసైడ్ ట్రైహైడ్రేట్, డైక్లోఫెనాక్ సోడి యం ఔషధాలను రూ. 20.51గా నిర్ణయించాం. మరో 15 ఔషధాల గరిష్ఠ ధరల్నీ సవరించాం"అని వెల్లడించింది.

# 'జంపింగు'లపై దృష్టిపెట్టిన కేసీఆర్





## 'దిద్దుబాటు'కు సిద్ధమైనట్లేనా...!?

రాజకీయాల్లో ఎత్తులు పై ఎత్తులు కామన్. తాడితన్నేవాడికి.. తలతన్నేవాడు ఉంటారని అంటారు. ఇప్పు డు ఇదే విషయం తెలంగాణ రాజకీయాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. తనను ఎదిరించే నాయకులకు అదే తరహాలో చెక్ పెట్టాలని.. టీఆర్ ఎస్ అధినేత సీఎం కేసీఆర్ వ్యూహాత్మకంగా అడుగులు వేయాలని అను కుంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీజేపీ కాంగ్రెస్ రాజకీయాలు పుంజుకున్నాయి. వచ్చే ఎన్నికలే టార్గెట్గా ఈ రెండు పార్టీలు కూడా దూకుడు ప్రదర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికార పార్టీ టీఆర్ ఎస్ నుంచి కొంత మంది నాయకులు.. బీజేపీ వైపు చూస్తున్నారనే సంకేతాలు కొన్నాళ్లుగా వస్తున్నాయి. అదేసమయంలో కొందరు ఇప్పటికే కాంగ్రెస్ గూటికి చేరిపోయారు. మరికొందరు త్వరలోనే తమ దారి తాము చూసుకునేందుకు రెడీ అవుతున్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ ఇలాంటి వారికి తనదైన శైలిలో చెక్ పెట్టాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ప్రశాంత్ కిశోర్ సార థ్యంలోని బృందాలు.. సర్వేలు పూర్తి చేశాయి. అధికార పార్టీ ఎమ్మెల్యేల్లో ఎవరు నెగ్గుతారు.. ఎవరు తగ్గుతారు.. అనే విషయాలపై సర్వే చేసి.. కేసీఆర్కు నివేదిక పంపించారని తెలుస్తోంది. దీని ప్రకారం.. వచ్చే ఎన్నికల్లో ఓడిపోయే నాయకులకు టికెట్ ఇవ్వ రాదని.. కేసీఆర్ నిర్ణయించుకున్నట్టు టీఆర్ ఎస్ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇలాంటి వారంతా కూడా పక్కచూపులు చూస్తున్నారు. ముఖ్యంగా బీజేపీ నేతలతో టచ్లోకి వచ్చినట్టు తెలుస్తోంది. ఈ విషయంపై ఉప్పందిన కేసీఆర్.. ఇలాంటివారికి గట్టి వార్నింగ్ పంపే యోచనలో ఉన్నారని సమాచారం. దీనిపై ఆయన త్వరలోనే బయటపడతారని.. ఉండే వారు ఉండండి పోయే వారు పోండి! అనే హెచ్చరిక లు పంపనున్నారు. . టిక్కెట్లు లభించే చాన్స్ లేని పాతిక మంది ఎమ్మెల్యేల వరకూ ఇతర పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్న విషయంపై ఆయన సీరియస్గానే ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వారి దారి వారు చూసుకోవచ్చని.. స్వయంగా కేసీఆర్ ప్రకటించే ఛాన్స్ ఉందని అంటున్నారు. ఇదే జరిగితే.. ఖచ్చితంగా బలమైన సంకేతాలు పంపినట్టు అవుతుందని దీనివల్ల.. పార్టీకి ఎలాంటి ఇబ్బంది లేదనే వ్యూహాన్ని అమలు చేయడం ద్వారా.. ఉన్నవారిలో కేసీఆర్ పట్ల మరింత నమ్మకం.. విశ్వాసం చూరగొనే అవకాశం ఉ ఒటుందని అంటున్నారు. మరి ఏం చేస్తారో చూడాలి.

## ప్రజల కోసం ప్రయోగించిన బ్రహ్మాస్త్రం ధరణి పోర్టల్: కేటీఆర్

హైదరాబాద్: శరవేగంగా పరుగులు పెడుతున్న తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు ఆధునిక సంస్కరణలే పునాదిరాళ్లు అని మంత్రి కేటీఆర్ అన్నారు. టీఎస్ ఐపాస్ విధానంతో పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామమైందని కొనియాడారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇవాళ రాష్ట్ర వ్యాప్తంగా సుపరిపాలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఉద్దేశించి కేటీఆర్ ట్వీట్ చేశారు. "భూమి చుట్టూ అల్లుకున్న సవాలక్ష చిక్కుముళ్లను విప్పేందుకు ప్రజల కోసం ప్రయోగించిన బ్రహ్మాస్త్రం ధరణి పోర్టల్. జిల్లాల పునర్ వ్యవస్థీకరణ నుంచి నూతన కలెక్టరేట్ల నిర్మాణం వరకు.. తండాలు, గ్రామ పంచాయతీల నుంచి నూతన రెవెన్యూ డివిజన్లు, మండలాలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల వరకూ తెలంగాణలో తీసుకొచ్చిన ప్రతి సంస్కరణ భవిష్యత్ తరాలకు వెలకట్టలేనిది" అని కేటీఆర్ పేర్కొన్నారు.

## మంత్రి సత్యవతి రాథోడ్ వర్సెస్ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌బీ డోర్నకల్ బీఆర్ఎస్ టికెట్ వార్!!

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీలో వర్గపోరు ముదురుతోంది. మరో నాలుగైదు నెలల్లో తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో డోర్నకల్ నియోజకవర్గంపై సిట్టింగ్ ఎమ్మెల్యే రెడ్యా నాయక్, మంత్రి సత్యవతి రాథోడ్ ఇద్దరూ ఆశలు పెట్టుకున్నారు.

నువ్వా నేనా అన్నట్టు రాజకీయాలు చేస్తున్నారు. టికెట్ తనకంటే తనకంటూ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. సీఎం కేసీఆర్ ను ప్రసన్నం చేసుకునేందుకు కృషి చేస్తున్నారు. చాలా కాలంగా రెడ్యానాయక్, సత్యవతి రాథోడ్ ల మధ్య వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎవరు బరిలోకి దిగుతారు అన్న దానిపైన స్థానికంగా ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఇటీవల మాజీ మంత్రి, డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యా నాయక్ తాను ఎప్పుడు చనిపోతానా అని పార్టీలో పలువురు ఎదురుచూస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. డోర్నకల్ అసెంబ్లీ టికెట్ మళ్లీ తనదేనని,



తాను మళ్లీ పోటీ చేసి గెలిచే తీరుతానని రెడ్యానాయక్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక తాజాగా మంత్రి సత్యవతి రాథోడ్ సీఎం ఆదేశిస్తే డోర్నకల్ నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలోకి దిగుతానని పేర్కొన్నారు. రెడ్యా నాయక్ నిర్వహించే కార్యక్రమాలకు మంత్రి సత్యవతి వర్గం హాజరు కావటం లేదు. ఇక తాజాగా ఇరువురు నేతలు చేస్తున్న వ్యాఖ్యలతో ఇరువురి మధ్య ఉన్న వర్గ విభేదాలు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారాయి.

మొదటినుంచి రెడ్యానాయక్ కు, సత్యవతి రాథోడ్ కు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. గతంలో సత్యవతి రాథోడ్ టీడీపీ లోనూ, రెడ్యానాయక్ కాంగ్రెస్ లోనూ ఉన్నారు. ఆ సమయంలో కూడా ఎన్నికల్లో పోటీ చేసిన ప్రత్యర్థులు వీళ్ళిద్దరే. అనంతరం ఆ ఇద్దరు బిఆర్ఎస్ పార్టీలో చేరినప్పటికీ, ఇద్దరి మధ్య ఆధిపత్యపోరు నేటికీ కొనసాగుతూనే ఉంది. ఒకరి కార్యక్రమాన్ని ఇంకొకరు బాయ్ కాట్ చేయటం, ఇరువురు నేతలకు అలవాటుగా మారింది. దీంతో ఇరువురు నేతల మధ్య పార్టీ కార్యకర్తలు నలిగిపోతున్నారు. రెడ్యానాయక్, సత్యవతి రాథోడ్ ల వివాదాన్ని పరిష్కరించడానికి బీఆర్ఎస్ అధినాయకత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందో, ఎవరికి డోర్నకల్ టికెట్ ఇస్తుందో వేచి చూడాలి.

# బీజేపీ 'బండి' వెనుక.. 'బండ్లు' ఎక్కడ?



## 'ప్రభ' కోల్పోతున్న సంజయుడు

### సొంత పార్టీ నేతల నుండే మద్దతు కరువవుతోందా...!?

హైదరాబాద్ : బండెనక బండి కట్టి.. పదహారు బండ్లు కట్టి.. అనే పాట తెలగాణ మాగాణంలో ప్రతి గడపలోనూ వినిపించిన విషయం తెలిసిందే. ఒక్కరు పదం కట్టి కదం తొక్కితే.. వారిని అనుసరించి ఊళ్లకు ఊళ్లు ముందుకు కదిలిన సందర్భం.. నైజాం నిరంకుశ పాలనపై విప్లవం సాగించిన సందర్భం.. ఇంకా తెలంగాణ ప్రజల కళ్ల ముందు కనిపిస్తూనే ఉంది. అయితే.. మళ్లీ ఈ తరహా ఉ ద్యమాన్ని తీసుకువస్తామని.. నియంతగా ప్రజలను పీక్కుతింటున్న కేసీఆర్ కుటుంబ పాలనపై సమర శంఖం పూరిస్తామని.. తరచుగా చెబుతున్న బీజేపీ రాష్ట్ర చీఫ్ బండి..సంజయ్ రాను రాను.. తన ప్రభ కోల్పోతున్నారనే వాదన బలంగా వినిపిస్తుండడం గమనార్హం. వాస్తవానికి బండి సంజయ్ రాష్ట్ర కమలం పార్టీ పగ్గాలు చేపట్టిన తర్వాత.. మంచి ఊపు వచ్చిన విషయం తెలిసిందేనని పరిశీ లకులు చెబుతుంటారు. అప్పట్లో జీహెచ్ ఎంసీ ఎన్నికలు కానీ.. దుబ్బాక అసెంబ్లీ ఉప ఎన్నిక కానీ.. బీజేపీకి మంచి ఊపు తెచ్చింది. బండి సంజయ్.. మీటింగులకు జనాలు పోటెత్తారు. అదేవిధంగా నాయకులు కూడా ఎగబడి చూశారు. ఇక మీడియా కూడా తీవ్రస్థాయిలో ఆయనను ఫోకస్ చేసింది. ఆ సమయంలో చిత్రమైన ఘటనలు కూడా చర్చకు వచ్చాయి. బీజేపీకి ఇండైరెక్టా.. టీఆర్ ఎస్ పార్టీ మద్దతిచ్చిందనే వాదన ఉంది. కాంగ్రెస్ ఎక్కడ బలపడుతుందో.. తమ పుట్టిని ఎక్కడ ముంచుతుందో.. అని భావించిన టీఆర్ ఎస్.. బీజేపీకి మద్దతు తెలిపింది. దీంతో బీజేపీ కొంత మేరకు పుంజుకుంది. అయితే.. ఇదంతా కూడా బండి తన ఖాతాలోనే వేసుకున్నారు. ఇంకేముంది.. నావల్లే బీజేపీ పుంజుకుందని.. ఆయన వర్గం ప్రచారం చేపట్టింది. అంతేకాదు.. రాబోయే ఎన్నికల్లో.. బీజేకి కనీసం.. 30 స్థానాల్లో పాగా వేయడం ఖాయమనే అంచనాలు కూడా తెరమీదికి వచ్చాయి. దీంతో బండి ప్రభ ఓ రేంజ్లో వెలిగిపోయింది. ఈ ఊపులోనే.. కేసీఆర్ కేంద్రంగా విరుచుకుపడ్డారు. కుటుంబ పాలన అంటూ.. ప్రచారం చేశారు. ఇంకేముంది. .రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేస్తాం.. అంటూ.. పాదయాత్రలు చేపట్టారు. అయితే.. ఈ పాదయాత్ర మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. ఊపులేక బ్రేక్ ఇచ్చారు. మళ్లీ ప్రారంభించారు. అయినా.. ఎక్కడా ఊపు లేక పోవడంతో పాదయాత్ర ఊసు ఎత్తడం మానేశారు. ఇక గత ఆరు మాసాల నుంచి కూడా బండి ఆధ్వర్యంలో వాయిస్ వినిపిస్తోందే తప్ప.. విషయం కనిపించడం లేదనే వాదన వినిపిస్తోంది.

ఎందుకంటే.. నిజానికి పార్టీకి అధికారంలోకి వచ్చేసే సీన్ కానీ.. కనీసం 30 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకునే స్థాయికానీ ఉండి ఉంటే.. ఇప్పటికే.. పొరుగు పార్టీల నుంచి ముఖ్యంగా అధికార పార్టీ నుంచి కూడా వలసలు జోరందుకునేవి. ఎందుకంటే.. మరో ఏడాదిలోనే ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ఎవరికి వారు వచ్చేసి.. ఆయా సీట్లలో కర్చీఫ్లు వేసుకునేవారు. కానీ బండి వారి పరిస్థితి తద్భిన్నంగా ఉంది. ఒక్కరంటే.. ఒక్క నేత రాలేదు. పోనీ.. అధికారంలో ఉన్న వారు రాలేదు.. అంటే.. ఓకే అనుకోవచ్చు.. మాజీ లకు ఏమైంది.. వారు కూడా రాలేదుగా! సో.. దీనిని బట్టి.. బండి పరిస్థితి పైన పటారం.. అనే చందంగా మారిపోయిందని.. రాజకీయ నేతల మధ్య చర్చ సాగుతున్నట్టు తెలుస్తోంది. ఇదే విషయంపై ఇతర పార్టీల నేతలు కూడా చర్చించుకుంటున్నారు.

బండి వ్యాఖ్యలకు సొంత పార్టీ నేతలే.. మద్దతు తెలపడంలేదని.. ఇటీవల ఓ పత్రిక కథనం రాసుకువచ్చింది. అది కనుక తప్పయితే.. దీనిని ఖండించాల్సిన పరిస్థితి ఉంది. కానీ.. బీజేపీలో ఒక్కరంటే.. ఒక్కరూ ఖండించలేదు. సో.. ఏతా వాతా ఎలా చూసుకున్న బండి డల్ అయ్యారనేది వాస్తవం అంటున్నారు పరిశీలకులు. అందుకే.. బండెనక బండి కట్టి.. బండి వెనుక .. నడిచేందుకు.. ఎవరు ముందుకు రావడం లేదని చెబుతున్నారు. మరి ఇప్పుడే.. ఈ పరిస్థితి ఉంటే.. వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితి ఏంటి? అంటున్నారు పరిశీలకులు.

# సంపాదకీయం

## తెలంగాణ రాజకీయాల్లో ప్రకాశ్ అంబేద్కర్... ఎవరికి ప్లస్సు?

భారతదేశంలోనే ఎక్కడా లేనంత ఎత్తుగా 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని హైదరాబాద్ లో ఏర్పాటు చేయించారు తెలంగాణా ముఖ్యమంత్రి కేసీఆర్. ఈ సమయంలో తెలంగాణలో ఎంటరైన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్... కేసీఆర్ పై ప్రత్యేకమైన అభిమానాన్ని పెంపెందించుకున్నారు! అయితే ఈ నేపథ్యంలో తెలంగాణ రాజకీయాల్లో ఎంట్రీ ఇవ్వబోతున్నారు ప్రకాశ్ అంబేద్కర్. దీంతో... ఈ ఎంట్రీ ఎవరికి ప్లస్సు – మరెవరికి మైనస్ అనే చర్చ తెరపైకి వచ్చింది. గతకొంతకాలంగా కేసీఆర్ పై చాలా అభిమానం చూపిస్తున్నారు ప్రకాశ్ అంబేద్కర్! కేసీఆర్ సర్కార్ లో కీలక పథకాలైన రైతుబంధు దళితబంధులను దేశవ్యాప్తంగా అమలుచేయాలనే డిమాండ్ ను సైతం తెరపైకి తెచ్చారు. ఈ క్రమంలో రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) జాతీయ అధ్యక్షుడిగా ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు ప్రకాశ్ అంబేద్కర్. అందులో భాగంగా... రాబోయే ఎన్నికల్లో తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో తమ పార్టీ పోటీచేస్తుందని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాల్లో జరిగిన ఒక బహిరంగ సభలో మాట్లాడిన ప్రకాష్ అంబేద్కర్... ఆర్పీఐ పార్టీ తరపున తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 119 నియోజకవర్గాల్లో తాము పోటీచేస్తామని ప్రకటించారు. కేంద్రంలోని బీజేపీని ఓడించడమే లక్ష్యంగా తమ పార్టీ ముందుకు వెళుతుందని తెలిపారు. ఈ సందర్భంగా బహుజనులంతా ఏకం కావాలని పిలుపు ఇచ్చారు. ఇది తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాల్లో ఒకటిగా విశ్లేషిస్తున్నారు పరిశీలకులు. తెలంగాణలో ఎన్నో కొత్త పార్టీలు వస్తుంటాయి.. వాటిలో ఇది ఒకటి అని లైట్ తీసుకునేటంత చిన్న విషయం కాదనేది వారి అభిప్రాయంగా ఉంది. కారణం... చట్టసభల్లో ఈ పార్టీకి ఎంత బలం ఉంది ఎన్ని సీట్లు ఉన్నాయి అనే సంగతి కాసేపు పక్కనపెట్టి... రానున్న ఎన్నికల్లో తెలంగాణలో ఎన్ని ఓట్లు చీల్చగలుగుతుందనేది కీలకంగా పరిగణలోకి తీసుకోవాల్సిన విషయంగా గుర్తుచేస్తున్నారు. ఎందుకంటే... తెలంగాణ సమాజంలో ఇది కొత్త పార్టీ అయినప్పటికీ... స్వయంగా అంబేద్కర్ మనవడు రంగంలోకి దిగేటప్పటికీ ఎన్నో కొన్ని బహుజనుల ఓట్లు కచ్చితంగా అటు పడే ఛాన్స్ ఉంది! ఆ ఎన్నో కొన్ని కాస్తా... 1000 వరకూ ఉన్నా కూడా అది అత్యంత కీలకమైన నెంబర్ గా పరిగణలోకి తీసుకోవాలి. ఎందుకంటే... ఈ ఆర్పీఐ పార్టీకి పడే ఆ వెయ్యో వెయ్యిలోపో ఓట్లు కచ్చితంగా ప్రభుత్వ వ్యతిరేక ఓట్లే అయ్యే ఛాన్స్ ఎక్కువ. అంటే... ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడంలో ఈ పార్టీ ఒక చెయ్యి వెయ్యబోతుందన్నమాట. ఫలితంగా అది బీఆరెస్స్ కు ప్లస్ అయ్యే ఛాన్స్ ఎక్కువగా ఉంది! దీంతో... ఆర్పీఐ పైనా బీఆరెస్స్ పైనా రకరకాల విశ్లేషణలు తెరపైకి వస్తున్నాయి. పైగా తెలంగాణ ఇప్పటికే బహుజనుల ఓటుబ్యాంకే లక్ష్యంగా ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో బహుజన్ సమాజ్ పార్టీ ఉన్నంతలో బలంగా ముందుకు పోతున్న సంగతి తెలిసిందే. తెలంగాణలో కొన్ని కీలక నియోజకవర్గాల్లో ఈ పార్టీ కూడా ఎంతో కొంత ప్రభావం చూపబోతుందని సర్వేలు తెరపైకి వస్తున్నాయి. ఈ సమయంలో బహుజనుల ఓట్లే లక్ష్యంగా మరోపార్టీ రంగంలోకి దిగడంతో ఇక్కడ పడేఓట్ల కంటే చీలే ఓట్లపై తెగ చర్చలు జరుగుతుండటం కొసమెరుపు.

# కొత్తూరు చెరువు.. పాత కథ



ఆదిలాబాద్ : ఒకటి కాదు.. రెండు కాదు.. 30 ఏళ్ల కథ. ఒక్క ఎకరాకు కూడా నీరివ్వని వ్యథ. ప్రజల గోసను అధికారులు గుర్తించడం లేదు. నాయకులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా సాగు నీరందించాలనే సదాశయంతో నిర్మించిన 125 ఎకరాల చెరువు నిరుపయోగంగా మిగిలిపోతోంది. మూడు దశాబ్దాల కిందట అధికంగా వెచ్చించి నిర్మించిన ప్రయోజనం లేకుండా పోతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జలకళను సంతరించుకున్నా ఫలితం ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. తలమడుగు మండల అటవీ ప్రాంతంలో రెండు గుట్టల మధ్యన నిర్మించిన కొత్తూరు చెరువు క(వ్య)థను తెలుసుకుంటే పాలకుల నిర్లక్ష్యం వెల్లడవుతుంది. పేరులో కొత్తదనం ఉన్నా ఏళ్లుగా పనుల నిర్వహణలో సాగునీటి శాఖ అలసత్వం బహిర్గతమవుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1990 దశకంలో కొత్తూరు చెరువు నిర్మించాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. అదేలాగంటే..అప్పట్లో భారీ వర్షాలు కురిసినా వ్యవసాయానికి ఉపయోగమేమీ ఉండేది కాదు. వర్షపు నీరంతా వృథాగా పోయేది. వేసవిలో భూగర్భజలాలు ఇంకిపోయి తాగునీటికి సైతం ఇబ్బందులు ఏర్పడేవి. గమనించిన అప్పటి అధికార యంత్రాంగం కొత్తూరుకు ఆనుకొని సహజసిద్ధంగా ఉన్న రెండు గుట్టలను అనుసంధానంచేస్తూ చెరువు నిర్మిస్తే సాగు, తాగు నీటికి కలిసొస్తుందని ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించింది. వెయ్యి ఎకరాలకు సాగు నీరందించేలా చెరువు నిర్మించడానికి ప్రభుత్వం రూ.కోటికిపైగా నిధులను మంజూరు చేసింది. 120 ఎకరాల విస్తీర్ణంతో చెరువు నిర్మాణం, మత్తడి, రెండు తూముల నిర్మాణం అప్పట్లోనే జరిగింది. సాగునీటికి నీరందించడంలో కీలకమైన మూడు కిలోమీటర్ల పొడవున కుడికాలువ, మరో రెండున్నర కిలోమీటర్లతో ఎడమ కాలువ నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగింది. ఏళ్లుగా పనులు పూర్తికాలేదు. వర్షాకాలం రాగానే చెరువునిండటం, మత్తడి పైనుంచి నీరు వృథాగా పోవడం మామూలుగా మారింది.

గుత్తేదారులకే ప్రయోజనం – కల్యాణ్, రైతు కొత్తూరు

మూడు ప్రభుత్వాలు మారాయి. మా చెరువు బాగుకాలేదు. ప్రభుత్వాలు మంజూరుచేసిన నిధులతో గుత్తేదారులకే మేలు జరిగింది. నాయకులు, అధికారులు అనుకుంటే చెరువును బాగు చేయించడం కష్టం కాదు. కానీ 30 ఏళ్ల నుంచి బాగు చేయడం లేదంటే అధికారిక లోపాలు ఉన్నట్లే కదా.

రూ. 40 లక్షలు చెరువులో పోశారు..

స్వరాష్ట్రమైన తెలంగాలో మిషన్ కాకతీయలో భాగంగా కొత్తూరు చెరువుకు ప్రభుత్వం రూ.40 లక్షలు కేటాయించింది. పనులు చేజిక్కించుకున్న గుత్తేదారులకు లబ్ధి చేకూరిందే తప్ప రైతులకు జరిగిన ప్రయోజనమేమీ కలగలేదు. గతంలో బండరాళ్లతో నిర్మించిన రెండు తూముల్లో గుత్తేదారు ఓ తూముకు నాసిరకంగా సిమెంటు, కట్టకురాళ్లు, కాలువల మరమ్మతులు చేసినట్లు మమ అనిపించడంతో ప్రయోజనం చేకూరలేదు. ఇప్పటికీ తూము పగుళ్లు తేలి కనిపిస్తోంది. కోతకు గురైన చెరువు కట్ట కనీస మరమ్మతులకు చేపట్టలేదు. మిషన్ కాకతీయ పథకంలోనైనా బాగవుతుందనుకున్న రైతుల ఆశలు నెరవేరలేదు. కొత్తూరు, సుంకిడి వాసులకు సాగు నీరందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు. నిబంధనల ప్రకారం.. రూ.40 లక్షలతో చెరువుకట్ట, రెండు కాలువల మరమ్మతులు పూర్తిచేసే అవకాశం ఉంది. కానీ గుత్తేదారులకు కొంతమంది క్రియాశీలక నేతల మద్దతు పుష్కలంగా ఉండటంతో పనుల నిర్వహణపై అధికారుల సరైన పర్యవేక్షణ కొరవడి అటవీప్రాంతంలో ఉన్న కొత్తూరు చెరువు కథ కంచికి అన్నట్లుగా మారింది. సాగునీటి శాఖ ఈఈ విఠల్‌ను సంప్రదించగా గతంలో ఏం జరిగిందనేది తనకు తెలియదన్నారు. వచ్చే వేసవిలో సాగు నీరందించేలా చెరువును ఉపయోగంలోకి తీసుకొస్తామని చెప్పారు.

# పంట నష్టపరిహారంపైనే రైతుల ఆశలు



ఆదిలాబాద్ : ప్రకృతి మిగుల్చుతున్న విషాదం.. అన్నదాతలను అతలాకుతలం చేస్తోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికందకుండానే పోతున్నాయి. ఈ సీజన్‌లో అధిక వర్షాలతో రైతుల పంట పొలాలు నీట మునిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేయాల్సిన పంట బీమా పథకం అమలు చేయకపోవడంతో బీమా పరిహారం రాని పరిస్థితి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం మంజూరు చేసే పంట నష్టపరిహారం పైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో వాగులు ఉధృతంగా ప్రవహించి వరద నీటితో పంట పొలాలు నీట మునిగాయి. చాలా చోట్ల చెరువులకు గండి పడి సమీప పంట పొలాల్లో పంటలు కొట్టుకుపోయాయి. మొలక స్థాయిలో నష్టం జరగడంతో తిరిగి పంటలు వేసుకునే అవకాశం ఉండటం కొంత ఊరట కలిగిస్తుంది. అయితే పంట నీట మునిగిన రైతులు తిరిగి విత్తుకోవాలంటే ఎకరానికి అయిదు వేలు తిరిగి పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి ఉంది. కొంత మంది రైతుల పొలాల్లో ఇసుక, మట్టి మేటలు వేయడంతో దాన్ని తొలగించి పంటలు సాగు చేసుకోవాలంటే ఎకరానికి రూ.10 వేలకు పైగా ఖర్చు అవుతుందని రైతులు వాపోతున్నారు. జిల్లాలో ఇప్పటికే సాధారణ సాగును మించి 5.43 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాగా వరదలతో 1.03 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లుగా అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

పంట బీమా లేదు..కేంద్ర ప్రభుత్వం అమలు చేసే ఫసల్‌బీమా యోజన పథకం లోపభూయిష్టంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం పథకాన్ని అమలు చేయడం లేదు. గతంలో పత్తి పంటకు వాతావరణాధారిత బీమా, సోయాకు గ్రామం యూనిట్ కింద పంట బీమా అమలు అయ్యేది. ఎకరానికి నిర్ణయించిన ప్రీమియంలో రైతులు 50 శాతం చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం 25 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం చెల్లించేది. రైతుల పోరాట ఫలితంగా 2018, 2019 సంవత్సరాల్లో చేసిన బీమాకు పరిహారం ఇప్పుడు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. గత రెండేళ్లుగా ప్రభుత్వం బీమా పథకం అమలు చేయకపోవడంతో రైతులు ప్రీమియం చెల్లించడం లేదు.

మూడేళ్లుగా రాని పరిహారం

పంటలు నష్టపోయిన సందర్భంలో ప్రభుత్వం సర్వే చేయించి సంబంధిత రైతులకు నేరుగా పంట నష్టపరిహారం మంజూరు చేస్తుంది. అయితే గత మూడేళ్లుగా పంటలు నష్టపోయిన పరిహారంను విడుదల చేయలేదు. ఈ ఏడాది ఇప్పటి వరకు అధికారులు ప్రాథమిక అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించారు. పరిహారం మంజూరుపై ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. ఈ విషయమై జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్యను వివరణ కోరగా మండలాల వారీగా పంటలకు జరిగిన నష్టాన్ని ప్రాథమికంగా అంచనాలు వేసి పంపించామని తెలిపారు.. పంట నష్టపరిహారంకు సంబంధించిన మార్గదర్శకాలు రాలేదు.. రాగానే రైతుల వారీగా సర్వే నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఉట్నూర్ మండలం నాగాపూర్ గ్రామానికి చెందిన చంద్రరావు అనే రైతుకు రెండు ఎకరాలు ఉంది. అందులో పత్తి వేశారు. భారీ వర్షాలతో నాగాపూర్ చెరువు నిండి అలుగుపై నుంచి ఉద్ధృతంగా వరద ప్రవహించడంతో సమీప పంట పొలాలు నీట మునిగాయి. ఈయన పంట చేనులో మట్టి, ఇసుక పేరుకుపోవడంతో తిరిగి పంట సాగు చేసుకునే ప్రయత్నంలో ఉన్నాడు.

బేల మండలం సాంగ్వి(కే) గ్రామానికి చెందిన భగవత్‌రావు పంట పొలంలోకి నీరు చేరి మొత్తం మునిగిపోయింది. ఈయనకు ఉన్న ఎనిమిదెకరాల్లో పత్తి, సోయా సాగు చేశాడు. సాత్నాల వాగులో భారీగా నీరు రావడంతో వరద ప్రవాహం పంట పొలాలను ముంచింది. పంటలు తిరిగి కోలుకునే అవకాశం లేదు. మళ్లీ విత్తుకోవాల్సిందే. ఎకరానికి రూ.5 వేల చొప్పున తిరిగి విత్తుకోవాలంటే రూ.40 వేలు అదనంగా పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రాథమిక నష్టం అంచనా ఇలా ఉంది మండలాలు : 18 నష్టపోయిన గ్రామాలు: 363 పత్తి: 67,945 సోయా: 27,185 కంది: 8175

మొత్తం: 1,03,305

నష్టపోయిన రైతులు : 29,805

# గురుకులానికి గురిపెట్టి

మంచిర్యాల : ఉమ్మడి జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఖాళీ సీట్ల భర్తీ కోసం ఆదివారం నిర్వహించిన బీఎల్‌వీసెట్-2022 ప్రవేశ పరీక్ష ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ప్రశాంతంగా జరిగింది. ఆదిలాబాద్, కుమురంభీం, మంచిర్యాల జిల్లాలకు సంబంధించి 6,7,8,9 తరగతుల ఖాళీల ప్రవేశాలకు 3308 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో భాగంగా మూడు జిల్లాల్లో ఒక్కో జిల్లాలో 3 చొప్పున మొత్తం 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేసి పరీక్షను నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకు జరిగిన ఈ పరీక్షలో మొత్తంగా 2738 మంది విద్యార్థులు హాజరుకాగా 570 మంది గైర్హాజరయ్యారు. 6వ తరగతికి 897, 7వ తరగతికి 654, 8వ తరగతికి 597, 9వ తరగతికి 590 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 82.77 శాతం హాజరు నమోదైనట్టు ఆర్సీవో కె.స్వరూపారాణి పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలను ప్రత్యేక అధికారులు ఆర్సీవోతోపాటు మహేశ్వర్‌రావు ఇతర అధికారులు తనిఖీ చేసి పరీక్ష తీరును పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా పరీక్ష సాగినట్టు ఆర్సీవో తెలిపారు. పోలీసు, వైద్యసిబ్బంది అందుబాటులో ఉండి విద్యార్థులకు సేవలందించారు.

# ఇక ముద్ర పడాల్సిందే..!

ఆసిఫాబాద్ : పాఠశాలల్లో బయోమెట్రిక్ హాజరు అమలుకు రాష్ట్ర విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఆగస్టు నుంచి ఉపాధ్యాయులు వేలిముద్ర ద్వారా హాజరు నమోదు చేయాల్సి ఉంటుందని అధికారులు ఇప్పటికే ప్రటించారు. 2019–20 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో 13 జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన ఆధార్ ఎనేబుల్డ్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్(ఈ–బాస్)ను కరోనా కారణంగా 2020లో నిలిపివేశారు. అప్పటి నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు.. పాత విధానంలో రిజిస్టర్లలోనే నమోదు చేస్తున్నారు. పలుచోట్ల ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదన్న ఆరోపణల నేపథ్యంలో బయోమెట్రిక్ హాజరు అమలు ఆవశ్యకతను ప్రభుత్వ పెద్దలు గుర్తించారు. దీనిని విద్యార్థులకు కూడా వర్తింపజేసి 100మంది విద్యార్థులకు ఒక డివైస్ చొప్పున సమకూర్చారు. ఈ నెల నుంచి మళ్లీ ఈ విధానాన్ని అమలు చేయాలని సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్రంలో బయోమెట్రిక్ హాజరును ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన 13 జిల్లాల్లో కుమురం భీం జిల్లా ఒకటి. జిల్లాలో ప్రభుత్వ, స్థానిక సంస్థలు, కేజీబీవీలు కలిపి 738 పాఠశాలల్లో బయోమెట్రిక్ హాజరు ప్రారంభం కానుంది. 1996 మంది ఉపాధ్యాయులు వేలిముద్రల ద్వారా తమ హాజరు నమోదు చేయనున్నారు. మొదట ఉపాధ్యాయులు, తర్వాత విద్యార్థుల హాజరును ఈ విధానంలో నమోదు చేయనున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. 44,172 మంది విద్యార్థుల హాజరు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా మధ్యాహ్న భోజన పథకం బిల్లులు మంజూరు చేయనున్నారు.

పాత వాటికి మరమ్మతులు..రాష్ట్ర విద్యాశాఖ లింక్ వెల్ సంస్థ ద్వారా బయోమెట్రిక్ హాజరు సాంకేతిక సహకారాన్ని తీసుకుంటోంది. రెండేళ్ల క్రితం వాడిన బయోమెట్రిక్ పరికరాలు ప్రస్తుతం పాఠశాలల్లో మూలనపడ్డాయి. వాటిని బయటికి తీసి వెంటనే ఛార్జింగ్ పెట్టి పనితీరును పరిశీలించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రధానోపాధ్యాయులకు ఇటీవలే ఆదేశించారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారుల ద్వారా డీఈవోలకు సమాచారం ఇచ్చారు. కండీషన్‌లో ఉన్నవాటి సంఖ్య, పనిచేయని వాటి వివరాలను సేకరిస్తున్నారు. పనిచేయని వాటికి వెంటనే మరమ్మతులను చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. అంతర్జాల సమస్య రాకుండా యాంటెనాలు ఏర్పాటు చేస్తూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

సెలవులు, ఆన్‌డ్యూటీలు నమోదు చేయవచ్చు

గతంలో హాజరు మాత్రమే చూపిన బయోమెట్రిక్ హాజరు యంత్రంలో ఈసారి వేలిముద్ర హాజరుతో పాటు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సెలవుపై వెళ్లినప్పుడు సెలవు నమోదు చేయడానికి అవకాశం కల్పించనున్నారు. అలాగే ఆన్‌డ్యూటీపై శిక్షణలు, సమావేశాలు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వెళ్లినప్పుడు బయోమెట్రిక్ డివైస్‌లో ఆన్‌డ్యూటీని నమోదు చేసుకొనే వీలు కల్పించనున్నారు. పాఠశాలకు స్థానిక సెలవును ప్రకటించిన సయమంలో సెలవు దినాన్ని సృష్టించవచ్చు

మరమ్మతులు చేపడుతున్నాం.. – భరత్‌కుమార్, విద్యాశాఖ సెక్టోరల్ అధికారి

ఆగస్టు నెల నుంచి పాఠశాలల్లో ఉపాధ్యాయులకు బయోమెట్రిక్ హాజరు నమోదును ప్రారంభించేందుకు విద్యాశాఖ ఆదేశించింది. ఈమేరకు జిల్లాలో చర్యలు చేపట్టాం. యంత్రాల స్థితిని పరిశీలించి అవసరమైన వాటికి మరమ్మతులు చేపడుతున్నాం. గతంలో మాదిరి అంతర్జాల సమస్య ఎక్కడా ఉండకపోవచ్చు

జిల్లాలోని పాఠశాలలు: 738 వచ్చిన బయోమెట్రిక్ పరికరాలు: 794

యాంటెనాల సంఖ్య : 450 ఐరిస్ స్కానర్లు... : 579

# జనావాసంలో..దోమల నివాసం

ఆసిఫాబాద్ : వాతావరణంలో మార్పులకు తోడు మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య నిర్వహణ లోపం జిల్లా వ్యాప్తంగా పుర వాసులను ఆందోళనకు గురి చేస్తోంది. గడిచిన నెలలో భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లోని కాలనీల్లోని నివాస గృహాల నడుమ రోజుల తరబడి నీరు నిలిచి ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. దోమల కారణంగా ఆసుపత్రులకు రోజురోజుకు జ్వర పీడితులు వరుస కడుతుడటం పరిస్థితికి అద్దం పడుతోంది. పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాల్సిన మున్సిపల్ శాఖ మాత్రం నామమాత్రపు చర్యలతో సరిపుచ్చుతోంది.

తూతూ మంత్రంలా చర్యలువర్షాకాలంలో జ్వరాల బారిన పడటానికి తాగునీరు కలుషితం కావడం ప్రధాన కారణం. కాగా మున్సిపాలిటీల్లో చాలా ప్రాంతాల్లో పైపు లైన్లు లీకేజీతో తాగునీరు కలుషితం అవుతోంది. నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాల్సి ఉన్నప్పటికీ నామమాత్రాంగానే సాగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. సిబ్బంది కొరత కారణంగా కాలనీల్లో చెత్త తరలింపు కూడా రెండు నుంచి మూడు రోజులకు ఒకసారి జరుగుతోంది.

సగటున యాభై మంది వస్తున్నారు – శేఖర్, వైద్యాధికారి, లక్షెట్టిపేట

గడిచిన పదిహేను రోజులుగా జ్వరాల బారిన పడి ఆసుపత్రికి వస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వర్షాలు తగ్గిన తర్వాత రోజుకు సగటున యాభై మందికి పైగా వైరల్ జ్వరాల బారిన పడి ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్నారు.

అమలుకు నోచుకోని ప్రణాళికవర్షాకాలంలో సీజనల్ వ్యాధుల ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో పురపాలికల్లో పారిశుద్ధ్య నిర్వహణ అమలుకు అధికారులు ప్రణాళికలు రూపొందించినప్పటికీ దానిని అమలు చేయడలో మాత్రం విఫలం చెందుతున్నారు. జిల్లాలో కొత్తగా ఏర్పడిన కాలనీల్లో, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి ఉండకుండా చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. చాలా కాలనీల్లో మురుగునీరు వెళ్లడానికి వీలుగా కాల్వల నిర్మాణం చేపట్టలేదు. దీంతో వర్షం నీరు నిలిచి ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయి. మరో వైపు పిచ్చిమొక్కలతో కాలనీలు నిండి ఉంటున్నాయి. ఇలా చేస్తే మేలు... కాలనీల్లో చాలా ప్రాంతాల్లో మురుగునీరు బయటకు వెళ్లే అవకాశం లేదు. అవసరం ఉన్న ప్రాంతాల్లో మురుగు కాల్వల నిర్మాణం చేపట్టాలి దశాబ్దాల క్రితం నిర్మించిన డ్రైనేజీలు శిథిలం కావడంతో నీరు నిలుస్తోంది. మరో వైపు పెరిగిన జనాభాకు అనుగుణంగా నూతనంగా డ్రైనేజీలను విస్తరించాలి. పురపాలికల్లో ఆక్రమణల కారణంగా కొన్ని ప్రదేశాల్లో డ్రైనేజీల్లో పూడిక నిండి ఉంటోంది. ముఖ్యంగా దుకాణ సముదాయాలు ఉన్న చోట్ల కాల్వలపై మీటర్ల దూరం వరకు సిమెంటు స్లాబు వేయడంతో పూడిక నిండి ఇబ్బందులు తప్పడం లేదు. అలాంటి చోట్ల పూడిక తీసేందుకు ఏర్పాటు జరగాలి. కాలనీల్లో ఓపెన్ ప్లాట్లు ఉన్న చోట పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. ఓపెన్ ప్లాట్లలో పిచ్చిమొక్కలు, మురుగునీరు నిలుస్తోంది. వాటి యజమానులకు నోటీసులు ఇచ్చి వదిలివేయడం కాకుండా పరిశుభ్రంగా ఉండేలా మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలి. వర్షాకాలంలో ట్యాంకులు, బావులు, బోర్లను క్లోరినేషన్ చేయాలి. నీటి పైపులు పగిలి తాగునీరు కలుషితం అవుతున్న ప్రాంతాలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలి.

# జిల్లా వాసులకు శుభవార్త

కరీంనగర్ : కరీంనగర్ జిల్లా వాసులకు శుభవార్త. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వైద్య కళాశాలకు ఎట్టకేలకు అనుమతి వచ్చింది. ఈ ఏడాది 100 సీట్లతో తరగతులు ప్రారంభించడానికి మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ) నుంచి అనుమతి వచ్చింది. కరీంనగర్ ప్రజలకు తక్షణ వైద్య సేవలతోపాటు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందనున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో, ఇతర అత్యవసర పరిస్థితుల్లో విషమించిన క్షతగాత్రులను, రోగులను వరంగల్ ఎంజీఎం, హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించేవారు. అక్కడికి వెళ్లేలోగా ప్రాణాలు కోల్పోయిన వారు లేకపోలేదు. ఇప్పుడు వైద్య కళాశాల సహకారం కావడంతో ఎంత పెద్ద గాయమైనా, అంతుచిక్కని రోగానికైనా పలు విభాగాలలో నిష్ణాతులైన వైద్య బృందం ఉంటుండడంతో కరీంనగర్ జిల్లావాసులకు ఆర్థికంగా నష్టపోకుండా ఎంతో ఉపయోగపడనుంది. ఏ రోగానికైనా వైద్యం అందుబాటులో ఉండనుంది.

హమ్మయ్య.. వచ్చేసింది

రాష్ట్రంలో తొమ్మిది ప్రభుత్వ ఆసుపత్రులను వైద్య కళాశాలలుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందుకు అనుగుణంగా ఎంసీఐ నుంచి అనుమతి పొందేలా అన్ని రకాల సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో కుమురంభీం, ఆసిఫాబాద్, కామారెడ్డి, ఖమ్మం, వికారాబాద్, జనగామ, రాజన్న సిరిసిల్ల, నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్ ఆసుపత్రులను వైద్య కళాశాలలుగా రాష్ట్ర ప్రభుత్వం మార్చింది. వీటన్నింటికంటే ముందే కరీంనగర్ జిల్లా ఆసుపత్రికి వైద్య కళాశాలగా అనుమతి వస్తుందన్న నమ్మకం ఉండేది. ఎనిమిది ఆసుపత్రులకు అనుమతి వచ్చి కరీంనగర్‌కు రాకపోవడంపై మంత్రులు ఆ శాఖ ఉన్నతాధికారులు, ఎలాగైనా అనుమతి వచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఎంసీఐ సూచించిన పలు విషయాలను పరిగణనలోకి తీసుకొని పరిష్కరించారు. సహాయ ఆచార్య పోస్టులను భర్తీ చేశారు. ఎట్టకేలకు బుధవారం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి కరీంనగర్ వైద్య కళాశాలగా అనుమతిస్తూ ఎంసీఐ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సంవత్సరమే 100 సీట్లతో అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. కరీంనగర్ వైద్య కళాశాలకు అనుమతి రావడంపై మంత్రి గంగుల కమలాకర్ సంతోషం వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లాలో రెండు ప్రైవేట్ వైద్య కళాశాలలున్నా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఉండాలని మంజూరు చేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు చెప్పారు.

ఈ సంవత్సరమే తరగతులు

కరీంనగర్ సంక్షేమ విభాగం : కరీంనగర్ వైద్య కళాశాలకు అనుమతి ఇప్పించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే వైద్య కళాశాల నిర్మాణానికి ఆయన మంత్రి గంగుల కమలాకర్ కృషి చేసినట్లు చెప్పారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చొరవతో ఎంసీఐ అనుమతిచ్చిందని తెలిపారు. ఈ సంవత్సరమే వంద సీట్లతో వైద్య, విద్యా తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

# బీసీలకు బాసట.. ఎందరికి ఊరట?

కరీంనగర్ : బీసీలకు వ్యక్తిగత రుణాల ఆశలు మళ్లీ చిగురిస్తున్నాయి.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎప్పటి నుంచో నిరీక్షిస్తున్న యువత ఉత్సాహంగా అర్జీలు పెట్టుకునేందుకు సమాయత్తమవుతున్నారు. తెలంగాణ దశాబ్ది వేడుకల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం స్వయం ఉపాధికి బాటలు వేసేందుకు రుణాలివ్వాలని తీసుకున్న నిర్ణయంతో ఆశావహుల సంఖ్య నాలుగు జిల్లాల పరిధిలో పెరగబోతోంది. ఈ నెల 20వ తేదీ వరకు గడువుని నిర్ణయించడంతో చిరు వ్యాపారులతోపాటు కొత్తగా ఉపాధిని అందుకోవాలనుకునేవారు ఆన్‌లైన్ కేంద్రాలకు, రెవెన్యూ కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ సహా ఇతర పత్రాలను సమకూర్చుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవడంతో ముందుగానే తమ వివరాల్ని నమోదు చేయించుకోవాలని చూస్తున్నారు.

అర్హులకు అందేనా?

గతంలో బీసీ కార్పొరేషన్ ద్వారా మూడు కేటగిరీలుగా అందించిన రుణసాయం విషయంలో ఉమ్మడి జిల్లాలో పైరవీలకే ప్రాధాన్యతనిచ్చారనే ఆరోపణలు వినిపించాయి. వచ్చిన దరఖాస్తుల్లో నుంచి తుది జాబితాలో ఎక్కువగా నాయకులు వారి అనుచరగణానికి చోటిచ్చారనే విమర్శలున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తరవాత కొన్నేళ్లపాటు ఇచ్చిన ఈ సాయం తరువాత నిలిపివేశారు. దాదాపుగా ఏడేళ్ల తరవాత మళ్లీ తెరమీదకు రుణాల ప్రస్తావన రావడంతో నిరుద్యోగ యువతలో ఆశలు చిగురిస్తున్నాయి. పైగా గతానికి భిన్నంగా ఈ సారి లక్ష రూపాయల రుణం వందశాతం రాయితీతో అందిస్తుండటంతో ఎందుకు ఈ అవకాశాన్ని వదులుకోవాలనే ఉద్దేశంతో అందరూ చొరవ చూపిస్తున్నారు. అప్పట్లో కేటగిరీ-1 కింద రూ.75 వేల నుంచి రూ.లక్ష, కేటగిరీ-2 కింద రూ.2 లక్షల వరకు, కేటగిరీ-3 కింద రూ.5 లక్షల నుంచి రూ.10లక్షల వరకు రాయితీ రుణం అందింది. ఈ సారి తక్కువ మొత్తంతో ఎక్కువ మంది బీసీ లబ్ధిదారులకు చేయూతనివ్వాలని సర్కారు భావిస్తోంది.

పెరగనున్న పోటీ!

ఈసారి అర్హుల ఎంపిక విషయంలో విపరీతమైన పోటీ ఉండనుంది. దీంతో కొందరు ఎందుకైనా మంచిదని ముందుగానే ఓ మాట తమకు తెలిసిన నాయకులకు చెబుతూనే అర్జీ పెట్టుకుంటున్నారు. 2015లో ఉమ్మడి జిల్లాకు బీసీ కార్పొరేషన్ ద్వారా 2,306 యూనిట్లు మంజూరుగా అప్పుడున్న నిబంధనల ప్రకారం వెల్లువలా దరఖాస్తులు అందాయి. ఏడేళ్ల కిందటే 20,926 మంది పోటీపడ్డారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ సంఖ్య దాదాపుగా ఐదింతలకు పెరిగే అవకాశముంది. 2018లో రాష్ట్రవ్యాప్తంగా 40 వేల మందికి రుణాలను ఇవ్వాలని తీసుకున్న నిర్ణయంతో హైదరాబాద్ సహా కొన్ని జిల్లాల్లోనే ఎంపిక ప్రక్రియను చేపట్టారు. అప్పుడు ఉమ్మడి జిల్లాకు అవకాశం లభించలేదు. నాలుగు జిల్లాల పరిధిలో మాత్రం ప్రతి వార్షిక సంవత్సరంలో బీసీ కార్పొరేషన్, సంక్షేమశాఖల తరఫున రుణాలను అందించేందుకు ప్రణాళికల్ని రూపొందించి ప్రభుత్వానికి పంపుతున్నారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపు ఉంటున్నా.. క్షేత్రస్థాయికి యూనిట్ల మంజూరు ప్రస్తావన ఇన్నాళ్లు వినిపించలేదు. స్వయం ఉపాధితో ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఆశతో ప్రతి ఏడాది బీసీలంతా రుణాల కోసం నిరీక్షిస్తూ వస్తున్నారు. ఎట్టకేలకు ఈసారి రుణాలిచ్చే నిర్ణయంతో తక్కువ రుణమైనా.. ఎక్కువ రాయితీతో అందుతుందనే ఉత్సాహంతో ఆ దిశగా ఆశావహ యువత అడుగులేస్తున్నారు.

# వైద్య కళాశాలల్లో ఖాళీలు... బదిలీలతో భర్తీకి చర్యలు




గోదావరిఖని : రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో ఇటీవల కొత్తగా సహాయ ఆచార్యులను ప్రభుత్వం నియమించింది. బదిలీలతో భర్తీ చేయాల్సిన పోస్టుల వివరాలను ఇటీవల ప్రకటించింది. కొత్తగా ఏర్పాటు చేసిన వైద్య కళాశాలల్లో సూపర్ స్పెషాలిటీ విభాగాల్లోని పోస్టులను ఖాళీలుగా చూపించగా దాదాపుగా అన్ని వైద్య కళాశాలల్లో క్లినికల్, పారా క్లినికల్ విభాగాల్లోని ఖాళీలను ప్రకటించారు. సుమారు రెండేళ్ల సర్వీసు పూర్తి చేసి ఇతర కళాశాలల్లో పనిచేస్తున్న సహాయ ఆచార్యులు ప్రభుత్వం ప్రకటించిన ఇతర వైద్య కళాశాలల్లోని ఖాళీలకు అనుగుణంగా బదిలీపై వెళ్లేందుకు అవకాశముంది. కాకతీయ, గాంధీ, ఉస్మానియా తదితర వైద్య కళాశాలల నుంచి కొత్తగా ఏర్పాటైన వాటిలోకి బదిలీపై వెళ్లేందుకు వీలుంది. ఇప్పటికే ప్రధాన నగరాల్లోని ప్రముఖ వైద్య కళాశాలల్లో పనిచేస్తూ స్థిరపడినవారు రాజధానికి దూరంగాఉన్న కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపిస్తారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఖాళీల వివరాలు ఇలా...కొత్తగా ఏర్పాటైన ఎనిమిది వైద్య కళాశాలల్లో కార్డియాలజీ, సీటీ సర్జరీ, ఎండోక్రానాలజీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, నెఫ్రాలజీ, ప్లాస్టిక్ సర్జన్, పీడియాట్రిక్ సర్జన్ తదితర సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో మొత్తం 62 పోస్టులను ఖాళీలుగా ప్రకటించారు. క్లినికల్ విభాగంలోని జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, ఆర్థో, ఈఎన్‌టీ తదితర విభాగాల్లో 22 వైద్య కళాశాలల్లో 447 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పారా క్లినికల్ విభాగంలో అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఫోరెన్సిక్ మెడిసిన్, మైక్రోబయాలజీ తదితర విభాగాల్లో 22 వైద్య కళాశాలల్లో 272 ఖాళీలను ప్రకటించారు. మల్టీ జోన్-1లో 683, మల్టీ జోన్-2లో 347 పోస్టులను ఖాళీలుగా చూపించారు. వీటిని ప్రకటిస్తేనే ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న సహాయ ఆచార్యులు ఆయా వైద్య కళాశాలల్లోకి బదిలీపై వచ్చే అవకాశముంది.

అందుబాటులోకి సూపర్ స్పెషాలిటీ సేవలు

ప్రభుత్వం ప్రకటించిన ఖాళీలు భర్తీ అయితే విద్యార్థులకు మెరుగైన బోధన, ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్‌లాంటి మహా నగరాలకే పరిమితమైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు జిల్లాకేంద్రాల్లో అందుబాటులోకి వచ్చే అవకాశముంది. గోదావరిఖని ఆసుపత్రి ప్రాంతీయ ఆసుపత్రిగా ఉన్న కాలంలో ప్రసూతి, ఎముకలు, పిల్లల, జనరల్ మెడిసిన్ వైద్య సేవలు మినహా మిగతా సేవలు నామమాత్రంగానే ఉండేవి. వైద్య కళాశాల ఏర్పాటుతో ఆసుపత్రి స్థాయి పెరిగింది. అదనంగా జనరల్ సర్జరీతో పాటు రేడియాలజీ, సైక్రియాట్రిస్టు, పల్మనాలజీ తదితర వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. దంత, ఈఎన్‌టీ, నేత్ర వైద్య సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ ఆయా విభాగాలకు అవసరమైన ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. తాజాగా ప్రభుత్వం ప్రకటించిన సూపర్ స్పెషాలిటీ ఖాళీలు భర్తీ అయితే స్థానికంగానే కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరి, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ప్లాస్టిక్ సర్జరీ తదితర వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

# బడికి వేళాయే.. పనులు సాగవాయే!



మెట్‌పల్లి : ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'మన ఊరు-మనబడి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని బల్దియాల పరిధిలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఎంపిక చేయగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని చోట్ల ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి, రెండు చోట్ల పనులు పూర్తయ్యాయి. ఉన్నత పాఠశాలల పరిస్థితి అధ్వానంగా ఉంది. గుత్తేదారుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే చందాన ఉన్నాయి. వచ్చే వారంలో పాఠశాలలు తెరచుకోనుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంది.

అంతా అసంపూర్తిగానే...మెట్‌పల్లి పట్టణంలో మూడు ఉన్నత, 5 ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశారు. 10 నెలల కిందట శిథిలావస్థలో ఉన్న ఉర్దూ మీడియం పాఠశాలను పూర్తిగా తొలగించారు. ప్రాథమిక పాఠశాలలో ఉదయం ప్రాథమిక, మధ్యాహ్నం ఉన్నత పాఠశాలను ఒక్కో పూట నడిపిస్తూ విద్యాసంవత్సరాన్ని పూర్తి చేశారు. ఇప్పటివరకు కేవలం పిల్లర్ల వరకే పనులు జరిగాయి. దీంతో నూతన సంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థుల తల్లిదండ్రులు వెనకడుగు వేస్తున్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో శిథిలావస్థలో ఉన్న 5 గదులను పూర్తిగా తొలగించి 6 నెలలు గడుస్తున్నా ఇప్పటికి పనులు పూర్తిచేయడం లేదు. ప్రస్తుతం పాఠశాల ఆవరణ పూర్తిగా ఇసుక, మట్టి, వివిధ సామగ్రితో నిండి పోయింది. బంటుపేట బాలుర ఉన్నత పాఠశాలలో నెలల కిందట ఐదు గదులను తొలగించారు. నూతనంగా రెండు గదులు, డైనింగ్ హాల్, వంటశాల, మూత్రశాలలు, తదితర వాటి నిర్మాణం కోసం డిసంబర్ 28న పనులకు శంకుస్థాపన చేయడంతో అప్పటి నుంచి స్థల వివాదంలో రెండు నెలల పాటు కొనసాగింది. సమస్యకు పరిష్కారం అయ్యాక పనులను ప్రారంభించారు. ఇప్పటి వరకు భవనం పైకప్పు వేశారు, మూత్రశాలల నిర్మాణం సాగుతుంది. ఈ విషయంపై మండల విద్యాధికారి భీమయ్యను వివరణ కోరగా పనులను వేగవంతం చేయాలని గుత్తేదారులకు సూచించామన్నారు. పనులు తొందరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# చకచకా సమీకృత మార్కెట్లు

కరీంనగర్ : కరీంనగర్ నగరవాసులకు నలువైపులా సకల సౌకర్యాలతో కొత్త మార్కెట్లు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. పెరుగుతున్న నగర విస్తీర్ణం, జనాభాకు తగ్గట్లుగా కూరగాయల మార్కెట్లు నిర్మించాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ స్థలాలను ఎంపిక చేసి పనులు ప్రారంభించారు. స్మార్ట్‌సిటీ, పట్టణ ప్రగతి నిధులు కేటాయించారు. ప్రస్తుతం నగరవాసులకు ఏకైక ప్రధాన కూరగాయల మార్కెట్ ఉండగా.. విపరీతమైన రద్దీ ఉంటుంది. రోడ్ల మీద క్రయవిక్రయాలు చేస్తుండటంతో సామాన్య ప్రజలకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. దీనికి దగ్గరల్లోనే మరో మార్కెట్ నిర్మిస్తుండటంతో వీధి వ్యాపారులకు అవకాశం లభించనుంది. వీటిని త్వరగా పూర్తి చేసేలా రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్, నగర మేయర్ సునీల్‌రావు, కలెక్టర్ కర్ణన్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తుండగా, అదనపు కలెక్టర్ గరిమ అగ్రవాల్, కమిషనర్ సేవా ఇస్లావత్ ప్రతి వారం పర్యవేక్షిస్తున్నారు.

నాలుగు చోట్ల ఆధునిక హంగులతో

పద్మనగర్‌లోని బుల్‌సెమన్ సెంటర్‌లో 2.08 ఎకరాల స్థలంలో మార్కెట్ పనులు చేస్తుండగా మొత్తం 239 దుకాణాలు నిర్మిస్తున్నారు. స్మార్ట్‌సిటీ నిధులతో సమీకృత మార్కెట్ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 55 శాతం మేర పనులు పూర్తి కాగా వచ్చే నెలాఖరులోగా పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించారు. నాన్‌వెజ్ గదులు పూర్తి కాగా, వెజ్ గదులు పనులు చేస్తున్నారు.

కిసాన్‌నగర్‌లోని వ్యవసాయ మార్కెట్‌లో 1.88 ఎకరాల స్థలంలో నిర్మిస్తున్నారు. మొత్తం 146 దుకాణాలు ఉంటాయి. పట్టణ ప్రగతి నిధులతో చేస్తుండగా ప్రస్తుతం 65 శాతం పనులు పూర్తయ్యింది. లిఫ్టు సౌకర్యాన్ని కల్పించనున్నారు. ప్రస్తుతం జీం1 శ్లాబు వేశారు. దుకాణాల వారీగా గదులు నిర్మించారు. టైల్స్ వేసే పనులు ప్రారంభించాల్సి ఉంది. కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఎదురుగా 2.31 ఎకరాల స్థలం ఉండగా ఇందులో మొత్తం 347 దుకాణాలు అందుబాటులోకి రానున్నాయి. ఇటీవల శ్లాబు వేశారు.

కశ్మీర్‌గడ్డలో 0.08 ఎకరాల రైతుబజారు స్థలంలోనే నిర్మించనున్నారు. వ్యాపారుల కోసం పక్కనే తాత్కాలిక షెడ్డులు వేయించారు. వీరిని



అక్కడికి తరలించి పాత షెడ్డు పూర్తిగా కూల్చివేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ మార్కెట్‌కు స్మార్ట్‌సిటీలో రూ.10 కోట్లు కేటాయించారు. డిజైన్ ప్రకారం పార్కింగ్, కూరగాయల వ్యాపారులు కూర్చోవడానికి అనువైన స్థలం కేటాయిస్తారు. 16న పనులు ప్రారంభించి తొమ్మిది నెలల్లో పూర్తి చేయాలని నిర్ణయించారు.

ఒకే చోట అన్ని లభించేలా..

నగర పరిధిలో నాలుగు చోట్ల సమీకృత మార్కెట్లు నిర్మించేందుకు రూ.39.90 కోట్లు కేటాయించారు. ఈ మార్కెట్లకు నగరవాసులు వస్తే అన్ని వస్తువులు ఒకే చోట లభించనున్నాయి. కూరగాయలు, మాంసం, చేపలు, పండ్లు, పూలు విక్రయించడానికి వేర్వేరు గదులు నిర్మిస్తున్నారు. లోడింగ్, అన్‌లోడింగ్, ప్లాట్‌ఫాంలు, సులభ్ కాంప్లెక్స్, ప్రహరీ, పచ్చదనం, కార్యాలయ గదులు, తాగునీరు, లైటింగ్, పార్కింగ్, ఎలక్ట్రానిక్ తూకం పాయింట్లు ఉంటాయి.

మూడు నెలల్లో పూర్తి

పద్మనగర్, కిసాన్‌నగర్‌లో నిర్మిస్తున్న రెండు సమీకృత మార్కెట్లు మూడు నెలల్లో పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం. వెండింగ్ జోన్లు, కొత్త మార్కెట్లలో కలిపి 1450 మంది వీధివ్యాపారులకు శాశ్వతంగా ఉపాధి కల్పిస్తాం.సునీల్‌రావు, మేయర్, కరీంనగర్

# వేసవి శిక్షణ.. భవితకు నిచ్చెన

కరీంనగర్ : విద్యార్థినులు వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నారు. తమకు నచ్చిన అంశంలో తర్ఫీదు పొందుతున్నారు. కరాటే, యోగా, నృత్య తదితర అంశాల్లో ఆరితేరుతున్నారు. గత 20 రోజులుగా ఎన్టీపీసీ సీఎస్సార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికా సాధికారత శిక్షణ శిబిరం(జెమ్-2023) సత్ఫలితాలను ఇస్తుంది. దీప్తి మహిళా సమితి, అధికారుల సంఘం, ఉద్యోగ గుర్తింపు సంఘం నాయకులు ఈ శిబిరంలో పాల్గొని విద్యార్థుల్లో మరింత ఆత్మస్థైర్యం నింపటానికి కృషి చేస్తున్నారు.

117 మంది విద్యార్థినులు...

ఎన్టీపీసీ సీఎస్సార్ ఆధ్వర్యంలో ప్రతి వేసవిలో విద్యార్థినులకు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మే 17వ తేదీ నుంచి 117 మంది విద్యార్థినులకు శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందుకోసం 6వ తరగతిలో చేరే విద్యార్థినులను ఎంపిక చేశారు. ఈ శిబిరంలో విద్యార్థినులకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నారు. రామగుండం, అంతర్గాం, పాలకుర్తి మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులు నైపుణ్యాలను ఇక్కడ అందిపుచ్చుకుంటున్నారు. శిక్షణ కాలంలో ప్రతిభ కనబర్చిన 10 మందిని ఎంపిక చేసి ఇంటర్ వరకు ఎన్టీపీసీ యాజమాన్యం ప్రైవేటు పాఠశాలలో ఉచితంగా విద్యను అందించనుంది. ఈ నెల 14తో శిబిరం ముగియనుంది.

ఉదయం నుంచి సాయంత్రం వరకు..

ఉదయం 5.30 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు వివిధ అంశాల్లో విద్యార్థినులు శిక్షణ పొందుతున్నారు. ఉదయం 5.30 గంటలకు నిద్రలేచిన అనంతరం గంటన్నర పాటు యోగా అనంతరం అల్పాహారం, పాలు, గుడ్డు అందిస్తారు. ఉదయం 9 గంటలకు గణితం, ఆంగ్లం, హిందీ, కంప్యూటర్, ప్రత్యేక నైపుణ్య తరగతులను నిర్వహిస్తారు. మధ్యాహ్న భోజనం అనంతరం 4 గంటలకు ఆర్ట్స్, క్రాఫ్ట్, నృత్య శిక్షణ ఇస్తారు. అనంతరం కరాటేలో తర్ఫీదు. సాయంత్రం 6 గంటలకు సంగీతం, పాటలు, ఆటల పోటీలను నిర్వహించి వారిలోని కళలకు జీవం పోస్తారు. రాత్రి 8 గంటల అనంతరం సమావేశం నిర్వహించి ఆ రోజు నేర్చుకున్న విషయాలు... మరింత నైపుణ్యం పెంపొందించుకునేందుకు దోహదపడే అంశాలను వివరిస్తారు.

ప్రత్యేక పర్యవేక్షణ.. వైద్యం

దీప్తి మహిళా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుంది. ప్రతిరోజు విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయటానికి ఎన్టీపీసీ వైద్యులు, నర్సు అందుబాటులో ఉంటారు. నిత్యం ఇండియన్ కాఫీ హౌస్ సిబ్బంది పౌష్టికాహారం సిద్ధం చేస్తారు. ఎంపిక చేసిన కొందరు ఎన్టీపీసీ ఉద్యోగులు, అధికారులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది విద్యార్థినుల నైపుణ్యాలను ప్రతిరోజూ పరీక్షిస్తుంటారు. వారంలో ఒకరోజు కాకతీయ ఏసీ ఆడిటోరియంలో సందేశాత్మక చలన చిత్రాలను ప్రదర్శించి విద్యార్థినులను చైతన్యం చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకుంటున్నాం

కుసుమ కృతిక, గంగానగర్

ఏటా వేసవి కాలం వృథాగా గడిపేవారం. ఈ శిబిరంలో చేరిన తర్వాత వేసవి సెలవులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నాం. కరాటేలో పూర్తి స్థాయి శిక్షణ తీసుకుంటున్నాం. శిబిరానికి వచ్చిన తర్వాత వివిధ కళలపై నాకు ఎక్కువ ఆసక్తి పెరిగింది. ఈ శిక్షణ కాలం నాలో ఎంతోమార్పు తీసుకువచ్చింది. వివిధ అంశాలపై పూర్తిస్థాయిలో పట్టు సాధించే అవకాశం లభించింది.

దూర ప్రాంతమైనా...

ఎస్.మానస, జీడీనగర్

దూర ప్రాంతం నుంచి వచ్చినా ఇక్కడ ఎటువంటి ఇబ్బందీ లేదు. తోటి విద్యార్థినులతో ఉండటంతో సమయం తెలియటం లేదు. యోగా ప్రాధాన్యతను తెలుసుకున్నా. శిక్షణలో ఎన్నో అంశాలపై పట్టు సాధించా. ఎన్టీపీసీ యాజమాన్యం పూర్తిస్థాయి సౌకర్యాలను కల్పించి, విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తోంది. ప్రాధాన్యమైన అంశాలను ఇక్కడ బోధిస్తున్నారు. పైతరగతులకు ఈ అంశాలు ఎక్కువగా ఉపయోగపడతాయి.

ఆత్మస్థైర్యం ముఖ్యం..

రమేష్, ఉద్యోగ గుర్తింపు సంఘం నాయకులు

విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యం ముఖ్యమైంది. ఎన్టీపీసీ చేపట్టిన ఈ శిబిరం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది. ప్రతి వేసవిలో ఎంతో ఖర్చుతో విద్యార్థినులకు శిక్షణ ఇప్పిస్తున్నాం. మా గుర్తింపు సంఘం నుంచి కందుల స్వామి, జి.సత్యనారాయణ, విజేందర్‌రెడ్డి, బండ రాములు, తోటి అధికారులతో కలిసి నిత్యం పర్యవేక్షిస్తున్నాం. ఈ శిబిరం విద్యార్థినుల్లో బలమైన సంకల్పాన్ని నింపుతుందని ఆశిస్తున్నాం.

# తరచూ వివాదాలు.. కొనసాగని నిర్మాణాలు

పెద్దపల్లి: జిల్లాలో 'మన ఊరు- మన బడి' పనులు తడబడుతూ కొనసాగు తున్నాయి. తరచూ సర్పంచులు, పాఠశాల యాజమాన్య కమిటీల మధ్య వివాదాలు జరగుతున్నాయి. కొన్ని మండలాల్లో ఏకంగా నిర్మాణ పనుల్లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. అక్రమాల పంపకాల్లో తేడాలు వచ్చి ఒకరిపై మరొకరు జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదులు చేసుకునే పరిస్థితులకు వెళుతున్నాయి. ఉపాధిహామీలో మంజూరైన మరుగుదొడ్లు, ప్రహరీ, కిచెన్ షెడ్ల పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకు రావడం లేదు. ఇంకో వారం రోజుల్లో విద్యా సంస్థలు పునఃప్రారంభం కానున్న వేళ.. నిర్మాణ నత్తనడకన సాగుతుండటం గమనార్హం.పలు చోట్ల ఇలా..జిల్లా స్థాయిలో సమీక్షలు తప్ప ఎక్కడి పనులు అక్కడే కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. పనులు చేసిన గుత్తేదారులకు నిరీక్షణ తప్పడం లేదు. ఎంబీ రికార్డులు చేయడంలో ఇంజినీరింగ్ అధికారులు కొర్రీలు విధిస్తున్నారు. గ్రామీణ పాఠశాలల్లో ప్రహరీ, కిచెన్, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణానికి ఉపాధిహామీ నిధులు ప్రతిపాదించారు. పల్లె ప్రగతిలో చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు ముందుకు రావడం లేదు.

ఇటీవల ముత్తారం-ఖమ్మంపల్లి, రామగుండం, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ ప్రాంతాల్లో అక్కడక్కడా సర్పంచులు, గుత్తేదారులు, పాఠశాల యాజమాన్య కమిటీల మధ్య తరచూ వాగ్వాదాలు చోటుచేసుకుంటున్నాయి. కమీషన్లు ఇవ్వాలని కొందరు, పనులు సక్రమంగా చేయాలని మరికొందరు, నాణ్యత లేని నిర్మాణాలు చేస్తున్నారని.. ఇలా పరస్పరం గొడవలు జరుగుతుండటం పనుల ఆలస్యానికి కారణాలుగా అధికారులు చెబుతున్నారు. ధర్మారంలోని శాయంపేటలో మూత్రశాల నిర్మాణం, విద్యుద్దీకరణ, తాగునీరు సరఫరా, పెయింటింగ్ పనులు ప్రారంభించలేదు. ఎలిగేడులోని ధూళికట్ట జడ్పీ పాఠశాలలో గదుల మరమ్మతు, విద్యుద్దీకరణ, డైనింగ్‌హాల్ ఏర్పాటు పత్తా లేదు. జూలపల్లిలోని వడ్కాపూర్‌లో డైనింగ్‌హాల్, గదుల మరమ్మతు, తాగు నీటి సరఫరా, విద్యుద్దీకరణ పనులకు మోక్షం లేదు. కమాన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో కిచెన్, మూత్రశాలలు, పెయింటింగ్ పనులు మిగిలి ఉన్నాయి. మంథనిలోని చిల్లపల్లిలో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ఓదెలలోని ఇందుర్తిలో కిచెన్, మూత్రశాలలు, విద్యుద్దీకరణ, గదుల ఆధునికీకరణ, తాగునీటి సరఫరా పనుల జాడ లేదు. గోదావరిఖని సీఎస్పీ కాలనీ బడిలో విద్యుద్దీకరణ పనులు పూర్తి చేశారు. భవనం గదుల మరమ్మతు, మూత్రశాలలు మొదలు కాలేదు. సుల్తానాబాద్‌లోని నారాయణాపూర్‌లో గదుల ఆధునికీకరణ, మూత్రశాలలు ప్రారంభించ లేదు.

# అయోమయంలో ఎంఈవోలు

కరీంనగర్ : జిల్లాలోని ఎంఈవోలకు మండలాల కేటాయింపు గందరగోళంగా మారిన నేపథ్యంలో విధుల్లో చేరేందుకు వెనకడుగు వేస్తున్నారు. ఇది వరకు అదనపు బాధ్యతలతో ఎంఈవోలుగా వ్యవహరిస్తున్న వారికి స్థాన చలనం కల్పిస్తూ ఇతర మండలాలకు జిల్లా విద్యాశాఖ కటాయించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను కూడా జారీ చేశారు. అయితే జడ్పీ ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా వ్యవహరిస్తున్న వారే అదనపు బాధ్యతలతో వారు పనిచేస్తున్న మండలం, పక్క మండలాలకు ఇప్పటి వరకు కొనసాగుతున్నారు. తాజాగా వాటిని మార్పు చేస్తూ వారు పనిచేసే పాఠశాలకు దూరంగా బాధ్యతలు అప్పగించడంతో ఏం చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. బాధ్యతలు చేపడితే ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసే పాఠశాలలు, నివసిస్తున్న ప్రాంతాలకు దూరంగా నిలుస్తూ పర్యవేక్షణ చేయడం తలకు మించిన భారంగా వారు పరిగణిస్తున్నారు. ఒకరిద్దరికి కొత్త మండలాల కేటాయింపు అనుకూలంగా ఉన్నా మిగిలిన వారికి ఇబ్బందికరంగా ఉంది. ప్రస్తుతం 16 మండలాలకు ఆరుగురే ఎంఈవోలుగా వ్యవహరిస్తుండగా, ఒక్కొక్కరు రెండు మూడు మండలాలకు ఇన్‌ఛార్జిగా ఉన్నారు. ఇప్పుడున్న విధానంలోనే ఎంఈవోలుగా వ్యవహరించేలా చూడాలని వారు జిల్లా పాలనాధికారి దృష్టికి తీసుకెళ్లి కొత్తగా మండలాలకు మార్చడం వల్ల ఎదుర్కొనే ఇబ్బందులను వివరించేందుకు వారు సన్నద్ధమయ్యారు. శనివారం పాలనాధికారిని కలిసేందుకు వారు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో కలిసి పరిస్థితిని విన్నవించాలని సన్నద్ధమవుతున్నారు.

# సౌరగుండం

గోదావరిఖని : సౌర విద్యుత్తుకు రామగుండం కేంద్రంగా మారుతోంది. సింగరేణి, ఎన్టీపీసీ సంస్థలతో పాటు జెన్‌కో సౌర విద్యుత్తు ఉత్పత్తిపై దృష్టి సారించడంతో జిల్లాలో 170 మెగావాట్ల ఉత్పత్తికి చేరువైంది.. ఎన్టీపీసీ 110, సింగరేణి 50, జెన్‌కో 10 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్తు కేంద్రాలు నెలకొల్పాయి. ఎన్టీపీసీ, సింగరేణి సంస్థల ప్లాంట్లలో ఉత్పత్తి మొదలైంది. జెన్‌కో త్వరలోనే పనులు చేపట్టనుంది. స్థలం వృథా కాకుండా ఎన్టీపీసీ సంస్థకు చెందిన జలాశయంపైనే నీటిపై తేలియాడే సౌర పలకలను ఏర్పాటు చేసి విద్యుత్తు ఉత్పత్తి చేస్తోంది. సింగరేణి సంస్థకు విస్తారమైన స్థలాలు ఉండటంతో అందులోనే కేంద్రాలు ఏర్పాటు చేసింది. జెన్‌కో సాగునీటి కాల్వలపై సోలార్ పలకలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేసుకుంది. దీంతో ఏ జిల్లాలో లేనివిధంగా పెద్దపల్లి జిల్లా సౌర విద్యుత్తు ఉత్పత్తికి కేంద్రంగా మారింది.

జలాశయంపైఇక్కడ నీటిపై కనిపిస్తున్నది ఎన్టీపీసీ సంస్థ ఏర్పాటు చేసిన సౌర విద్యుత్తు కేంద్రం.. ఖాళీ స్థలం వృథా కాకుండా జలాశయంలోని నీటిపై తేలియాడే సౌర పలకలను ఏర్పాటు చేసి 100 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తోంది. ఎన్టీపీసీకి నీటిని వినియోగించుకోవడానికి ఏర్పాటు చేసిన జలాశయంపైనే విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు ప్రణాళికలు చేసిన ఎన్టీపీసీ రూ.423 కోట్ల వ్యయంతో సౌర విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. 500 ఎకరాల విస్తీర్ణంలో నీటిపై తేలియాడే సౌర పలకలను ఏర్పాటు చేసిన సంస్థ 40 బ్లాకుల్లో వాటిని అమర్చింది. ఎన్టీపీసీ సంస్థ బయట ఉన్న స్థలంలో ఏర్పాటు చేయకుండా నీటిపై తేలియాడే సౌర పలకలను ఏర్పాటు



చేయడం ద్వారా స్థలం వృథా కాకపోవడంతో పాటు నీటిపైనా విద్యుత్తును ఉత్పత్తి చేసే అవకాశం ఉంటుందని వాటిని ఏర్పాటు చేసింది. 100 మెగావాట్ల సోలార్ ప్లాంటును ప్రధాని నరేంద్రమోదీ జాతికి అంకితం చేశారు. దీంతో పాటు ఎన్టీపీసీ సంస్థ ఇదివరకే 10 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. నీటిపై మరో 50 మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తి కేంద్రానికి ప్రణాళికలు చేస్తోంది. అప్పటి వరకు మొత్తం 110 మెగావాట్ల సౌర విద్యుత్తును ఉత్పత్తి చేస్తోంది.

నేలపై..సింగరేణి సంస్థ మూడేళ్ల క్రితమే సౌర విద్యుత్తు ఉత్పత్తిపై దృష్టి సారించింది. సింగరేణి వ్యాప్తంగా ఖాళీ స్థలాల్లో సౌర పలకలు ఏర్పాటు చేసి విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు ప్రణాళికలు చేసిన సింగరేణి అందులో భాగంగానే జిల్లాలోని సెంటినరీకాలనీ సమీపంలో 50 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్తు ఉత్పత్తి చేసే ప్లాంటును ఏర్పాటు చేసింది. రూ.250 కోట్లతో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని గత డిసెంబరులో పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చింది. 250 హెక్టార్లలో సౌర పలకలను ఏర్పాటు చేసింది. 50 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించిన ప్లాంటు పూర్తిస్థాయి పీఎల్‌ఎఫ్ సాధిస్తుంది. సింగరేణితో పాటు ఇతర అవసరాలకు ఈ ప్లాంటు ఉపయోగపడుతోంది. ఇందులో ఉత్పత్తయిన విద్యుత్తును గ్రిడ్‌కు సరఫరా చేసి అక్కడి నుంచి అవసరాలకు తీసుకుంటున్నారు. నేలపై సౌర పలకలను ఏర్పాటు చేసిన సింగరేణి నీటిపై తేలియాడే పలకలను కూడా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేసింది. కరీంనగర్‌లోని ఎల్‌ఎండీ జలాశయంలో 300 మెగావాట్ల సామర్థ్యంతో పలకలను ఏర్పాటు చేసి ఉత్పత్తి చేసేందుకు సర్వే పనులు చేపడుతోంది.

కాల్వలపై..సాగునీటి కాల్వలపై జెన్‌కో సోలార్ పలకల ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు ప్రణాళికలు చేసింది. ఆరేళ్లుగా సోలార్ పలకల ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేయాలన్న ఆలోచనతో ఉన్న జెన్‌కోకు తాజాగా అడుగులు పడుతున్నాయి. జిల్లాలో అత్యధికంగా నీరు ప్రవహించే డి-83 కాల్వపై నీటిపై తేలియాడే సౌర పలకలను ఏర్పాటు చేయాలని ప్రణాళికలు చేస్తోంది. ప్రస్తుతం హైడల్ ద్వారా విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లను నెలకొల్పిన జెన్‌కోకు ఆశించిన స్థాయిలో నీటి ప్రవాహం లేకపోవడంతో ఉత్పత్తి రావడం లేదు. కాల్వలపై సోలార్ పలకలను ఏర్పాటు చేసి 10 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు సిద్ధం చేసుకుంటోంది. డి-83 కాల్వపై కమ్మర్‌ఖాన్‌పేట, కాచాపూర్, తుర్కలమద్దికుంట ప్రాంతాల్లో సోలార్ పలకలను ఏర్పాటు చేసి 10 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు సిద్ధమవుతోంది.

# చేప పెరగదు.. ఆదాయం దక్కదు..!



కరీంనగర్ : జలాశయాల జిల్లాగా పేరొందిన కరీంనగర్ జిల్లాలో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపేలా చేప వృద్ధి చెందడంలేదు. అనుకున్న విధంగా లాభాలు దరిచేరడంలేదు. ఓ వైపు ప్రభుత్వం దీనిద్వారానే జీవనోపాధిని అందుకుంటూ బతుకుతున్న వారికి ఉచితంగా చేప పిల్లల్ని అందిస్తూ ఎదిగిన తరువాత వాటిని విక్రయించే వెసులుబాటును కలిపించింది. ఇందుకోసం పక్కాగా ప్రణాళికల్ని రూపొందించింది. కాని క్షేత్రస్థాయిలో అమలు, ఆచరణలో లోపాల వల్ల ఊహించని శాపం దిగుబడి రూపంలో దరిచేరుతోంది. చెరువులు, కుంటల్లో పెంచుతున్న వీటి విషయంలో అనుకున్న రాబడి రావడం లేదనే వాదన వీటిపై ఆధారపడే కుటుంబీకుల నుంచి వినిపిస్తోంది. 2016 నుంచి ఈ తరహా ప్రక్రియకు శ్రీకారం చుట్టగా.. మొదట్లో లాభసాటి పథకంగా ఇది మన్ననల్ని పొందినా.. తరువాత పర్యవేక్షణ లోపాలు, ఇతరత్రా వ్యవహారాల మూలంగా నిర్లక్ష్యపు ఒడిలోకి చేరుతోంది. పేరుకే పెంపకమనే జోరు పైకి కనిపిస్తున్నా.. లోపల మాత్రం డొల్లతనమనే ఇబ్బందే మత్స్యకారులను ఇరకాటంలో పెరుగుతోంది.

వచ్చిందే మేలనేలా..!

ప్రతి ఏటా తమ చేతికి అందుతున్న అరకొర ఆదాయంతో మత్స్యకారుల కుటుంబాలు కాలాన్ని వెల్లదీస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా 177 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలున్నాయి. వీటి పరిధిలో మొత్తంగా 13,283 మంది సభ్యులున్నారు. ఒక్క ఎల్‌ఎండీ (దిగువ మానేరు జలాశయం)పై ఆధారపడే వాళ్లే నాలుగువేల మంది ఉంటున్నారు. జిల్లాలో ప్రతి వర్షాకాలంలో ఎల్‌ఎండీతోపాటు సుమారు 800 వరకు చెరువులు, కుంటల్లో దాదాపుగా రెండు కోట్ల పిల్లల్ని వదులుతున్నారు. వదిలే చేప పిల్లల పరిమాణం 35 నుంచి 40 మి.మీ ఉంటుంది. ఇది ఏడాది కాలంలో పెరిగి పెద్దగా అయితే తక్కులో తక్కువగా కిలో బరువు తూగుతుంది. ఈ లెక్కన 2కోట్ల చేపలు వృద్ధి చెందితే దాదాపుగా 2వేల టన్నులు దిగుబడిగా రావాలి. ఒక వేళ చేపపిల్లల మరణాలు ఇతరత్రా కారణాలతో సగమే దిగుబడి వచ్చినా.. 10 వేల టన్నులు జిల్లాలో జాలరులకు చిక్కాలి. కాని ప్రతి ఏడాదిలో అంతకన్నా తక్కువ బరువైనవే వలలో పడుతున్నాయి. గతంతో పోలిస్తే మూడేళ్లల్లో దిగుబడి తక్కువగానే ఉంటుందనే వేదనను మత్స్యకారులు వ్యక్తం చేస్తున్నారు.

ఇలా ఇబ్బందికరమే..!

చేప పిల్లల్ని నీళ్లల్లో వదిలే సమయంలో లెక్కల విషయంలో పారదర్శకత కొరవడుతుందనే అభిప్రాయం గత కొన్నేళ్లుగా వినిపిస్తున్నా.. అధికారులు మాత్రం పక్కాగా వదులుతున్నామంటున్నారు.

ముఖ్యంగా రొయ్యల దిగుబడి విషయంలో ఊహించని నష్టం కలుగుతోంది. వేసిన రొయ్య 6 నెలల్లో 100 గ్రాముల బరువు పెరగాలి. పైగా దిగుబడి గణనీయంగా రావాలి. కాని అలా రావట్లేదు.!

అత్యధికంగా మూడేళ్లుగా జలాశయాల్లో నీళ్లు నిండుగా ఉండటం, మత్తడి పారుతుండటంతో తటాకాల్లోని చేపలు కిందకు వెళ్తున్నాయి. ఇలా చేపల దిగుబడిపై ఇది ప్రభావాన్ని చూపిస్తోంది.

సకాలంలో పిల్లల్ని చెరువుల్లో వదలడం సహా వాటి ఎదుగుదలకు తీసుకోవాల్సిన చర్యల్లో లోపాలు ఉండటం ఇబ్బందిని ఎక్కడికక్కడే పెంచుతోంది. ఎండకాలంలో రక్షణ చర్యలు కరవవుతున్నాయి.

బొచ్చ, జల్ల, చుక్కల పాప్లెట్ రకాల మత్స్యాలు కరీంనగర్ నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయి. అనుకున్న విధంగా ఇవి వృద్ధి చెందకపోవడంతో లాభాలు సరిగ్గా ఉండటం లేదు.

నీళ్లు ఎక్కువగా ఉన్న సందర్భంలో రొయ్యలకు ఆక్సిజన్ సక్రమంగా అందక ఎక్కువగా మృత్యువాత పడుతున్నాయని అధికారులు చెబుతున్నారు. పైగా విపరీత ఎండ వేడితో నష్టం వాటిల్లుతోంది.

# మానేరు పర్యాటకుల నిట్టూర్పు

సిరిసిల్ల : మానేరు తీరాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దడంలో యంత్రాంగం విఫలమవుతోంది. ఇక్కడ కొంత మేరకు సౌకర్యాలు తీసుకొచ్చినా, ఉపయోగించకుండానే శిథిలావస్థకు చేరుతున్నాయి. నిర్వహణ, పర్యవేక్షణ వ్యవస్థ లేకుండా పోయింది. ఈ సారైతే సందర్శకులు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. సెలవు దినాల్లో ఆహ్లాదం కోసం వచ్చేవారికి నిట్టూర్పే మిగులుతుంది. గంభీరావుపేట మండలం నర్మాల వద్ద ఎగువమానేరు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. దాదాపు 70 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ జలాశయం నిర్వహణ అగమ్యగోచరంగా మారింది. ఇది నిండిన సమయంలో పర్యాటకులు వచ్చి వీక్షిస్తారు. మూడు చోట్ల నుంచి ఉన్న దారుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గుబురుగా మారిన చెట్ల పొదలతో ఈ ప్రాంతం అడవిని తలపిస్తోంది. జలకళ వచ్చినపుడు మత్తడి దూకుతున్న సమయంలో పర్యాటకులు సిరిసిల్ల, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. ఇక్కడికి వచ్చినవారికి కనీస సౌకర్యాలు లేకపోవడం శోచనీయం. కట్టపైకి వెళ్లి సేదతీరే పరిస్థితి లేదు.

పడవలున్నా... నిర్వహణ సున్నా

మూడేళ్ల క్రితం ఎగువమానేరులోకి ఒక లాంచీ, రెండు పెట్రో బోట్లు



తీసుకొచ్చారు. కరోనా మహమ్మారితో ఎలాంటి కదలికలు లేకుండా పోయాయి. రెండేళ్ల క్రితం పెట్రో బోట్లను సిరిసిల్లకు తరలించారు. లాంచీ వినియోగం, నిర్వహణను మరిచిపోయారు. ఈ బాధ్యతలను పర్యాటకశాఖకు అప్పగించారు. వారు పట్టించుకోకపోవడంతో చుట్టూ పిచ్చిమొక్కలతో నిండిపోయింది. సెలవు రోజుల్లో ఇక్కడికి పెద్ద సంఖ్యలో వస్తుంటారు. కనీస సౌకర్యాలు కూడా లేవు. ఇటు సిరిసిల్ల, రాజరాజేశ్వర జలాశయంలోనూ పెద్ద పడవలు, పెట్రో బోట్లు ఉన్నా నిర్వహణ లేదు. రాజరాజేశ్వర జలాశయం వద్ద పర్యాటకుల సందడి లేకుండా పోయింది.

పర్యవేక్షణ లేకనే...ఎగువ మానేరు జలాశయాన్ని తిలకించేందుకు మూడు వ్యూపాయింట్లు ఉన్నాయి. ఇక్కడికి వెళ్లేందుకు సరైన మార్గం లేదు. చుట్టూ అటవీ ప్రాంతాన్ని తలపించడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. మానేరు తీరంలో భద్రతా వ్యవస్థ సక్రమంగా లేదని పలువురు ఆరోపిస్తున్నారు. డ్యాంలోని నీటిలో ప్రమాదవశాత్తు పడి మరణించిన వారు కొందరు కాగా అనుమానాస్పద స్థితిలోని మృతదేహాలు లభ్యమైన సంఘటనలు కూడా ఉన్నాయి. పర్యాటక ప్రాంతం అభివృద్ధి చేసి నిఘా పెంచాల్సిన అవసరం ఉంది. జలాశయం కింద లోలెవల్ కాజ్‌వేలు శిథిలమై వరదలకు కొట్టుకుపోయాయి. వీటికి కనీస మరమ్మతులు లేవు. దీంతో ఇటు నర్మాల, కోళ్లమద్ది గ్రామాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులను కాపలా పెట్టారు. ఎలాంటి వాహనాలు వెళ్లే అవకాశం లేదు. జలాశయం వద్దకు వచ్చే పర్యాటకుల భద్రతాపరమైన చర్యలు తీసుకోలేని పరిస్థితిలోనే బారికేడ్లతో మూసివేశారు.

# బడిలో తొలిమెట్టు



కరీంనగర్ : ప్రభుత్వ పాఠశాలల బాలల్లో తరగతులకు తగినట్లుగా సామర్థ్యాలు లేకపోవడం, కొవిడ్ కారణంగా రెండేళ్లు ప్రత్యక్ష తరగతులకు దూరమవడంతో విద్యార్థులు చదవడం, రాయడంలో వెనుకంజలో నిలుస్తున్నారు. భాష, గణిత సామర్థ్యాల్లో వారు ఆశించిన రీతిలో ప్రతిభను చూపలేకపోతున్నారు. ఇది వరకు చదువుకుతున్న తరగతుల్లో నేర్చుకున్నది కూడా మరిచిపోయారు. విద్యార్థులు చదువుల్లోని అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు గత ఏడాది కేంద్రం నిర్వహించిన జాతీయ సాధన సర్వే(నాస్)లో కూడా వెనుకంజలో ఉన్నట్లు తేలింది. చదువులకు పునాదిగా నిలిచే ప్రాథమిక స్థాయిలో ఈ పరిస్థితిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమం ఆగస్టు 15 నుంచి ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో నిర్వహించనుంది. ఏడాది పొడవునా కార్యక్రమం అమలు చేయనున్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులకు రెండు దఫాలుగా జిల్లా విద్యాశాఖ నిర్వహించే శిక్షణ కార్యక్రమం జులై 30 న ప్రారంభించింది.

నేర్పిస్తారు..జిల్లాలో ప్రభుత్వ పరంగా 468 ప్రాథమిక, 25 ప్రాథమికోన్నత పాఠశాలలు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో కొనసాగుతున్నాయి. మరో 8 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉర్దూ మాధ్యమంలో ఉన్నాయి. వాటిల్లో 1046 మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా, 1-7 తరగతుల్లో 33,823 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రతి విద్యార్థి భాషల్లో చదవడం, రాయడం, గణితంలో కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగాహారం లెక్కలు చేసేలా ప్రత్యేకంగా బాలలకు వాటిని ఉపాధ్యాయులు నేర్పించనున్నారు. రెగ్యులర్ తరగతులతో పాటు ఈకార్యక్రమాన్ని ప్రత్యేకంగా అమలు చేయనున్నారు. మండల స్థాయిలో ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుపనున్నారు.

తొలిమెట్టు కార్యక్రమం అమలుకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ జులై 26 నుంచి 28వ తేదీ వరకు 3 రోజుల పాటు ప్రతి మండలానికి నలుగురి చొప్పున ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. జిల్లాలోని ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు కూడ శిక్షణను నిర్వహిచారు. ప్రతి మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు మండలాల వారీగా రెండు దఫాలుగా శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ జులై 30 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు, ఆగస్టు 3 నుంచి 16వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. తొలిమెట్టు అమలుకు పుస్తకాలను ప్రతి పాఠశాలలకు ఒక సెట్ చొప్పున పంపిణీ చేసినట్లు సమగ్ర శిక్ష జిల్లా కో-ఆర్డినేటర్ కె.ఆశోక్‌రెడ్డికు తెలిపారు.

# క్రీడా ప్రాంగణాలకు స్థలమేదీ?

కరీంనగర్ : గతంలో ఎక్కడ పడితే అక్కడ ఖాళీ స్థలాలు ఉండేవి.. సెలవు రోజుల్లో, సాయంత్రం పూట పిల్లలు, పెద్దలు నచ్చిన ఆటలాడుకునే వారు. ఇప్పుడు ఆ వైపే ఆలోచన చేయడం లేదు. సెల్‌ఫోన్ ఉంటే చాలు పొద్దంతా అందులోనే కాలక్షేపం చేస్తున్నారు. ఆ విధానాన్ని తగ్గించుకునేందుకు..శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం కోసం ఇప్పుడిప్పుడే ప్రజలు ఆలోచన చేస్తుండటంతో క్రీడా మైదానాల ఏర్పాటు కీలకంగా మారింది. వీధుల్లో వీటిని నెలకొల్పాలని భావిస్తుండగా వాటికి కనీసం స్థలం దొరకడం లేదు.కరీంనగర్ నగరపాలక సంస్థతో పాటు మున్సిపాలిటీల్లోని అన్నీ వార్డులు, డివిజన్‌లలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ స్థలాలు గుర్తించి అవసరమున్నంత మేరకు దీనికోసం తీసుకునేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. నగరంలో 60 డివిజన్లు ఉండగా ఇప్పటివరకు ఆరు చోట్ల మాత్రమే స్థలాలు అనువుగా ఉండటంతో అక్కడ క్రీడా మైదానాలు ఏర్పాటయ్యాయి. మిగతా ప్రాంతాల్లో, విలీన కాలనీల్లో స్థలాలు దొరకడం కష్టంగా మారింది. కనీసం రోడ్డు పక్కన ఒకటెండ్రు పరికరాలు బిగించి ఆటలను ప్రోత్సహించాలని నిర్ణయించినా ఆ మేరకు కూడా స్థలం ఉండటం లేదు. కొన్ని డివిజన్ల పరిధిలో అయితే ఓపెన్ జిమ్‌కు స్థలం వెతుక్కోవాల్సిన పరిస్థితి లేకపోలేదు.

సిద్ధంగా ఉన్నా.. కనిపించని స్థలాలు

తెలంగాణ క్రీడా ప్రాంగణం(టీకేపీ-అర్బన్) పేరుతో లక్ష్యాన్ని విధించారు. కనీసం ఒక డివిజన్‌కు మూడు ఉండాలని ఆదేశాలు జారీ అయినా ఒక్కదానికి స్థలం లేదు. వాస్తవంగా ఐదు క్రీడలకు సరిపడా మైదానం ఒకే చోటా ఉండేలా ఎకరం స్థలం కావాలి. ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, లాంగ్ జంప్ పిట్, వ్యాయమం చేసేందుకు సింగిల్, డబుల్ బార్ వంటివి ఉండాలి. దీని చుట్టూ పచ్చదనం కోసం మొక్కలను పెంచాలి. ఇదంతా కల్పించడానికి అధికారులు, పాలకవర్గ సభ్యులు ఉత్సాహంగా ఉన్నా స్థలాలు ఎక్కడ అనేదే ప్రశ్నార్థకంగా మారింది.

ప్రధాన దృష్టి ఇక్కడే

పట్టణాలతో పాటు నగరంలో డివిజన్లు, వార్డుల వారీగా స్థలాలు లేకపోవడంతో పురపాలక శాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు పరిశీలిస్తున్నారు. గతంలో వీటిని ఎంపిక చేయకూడదని ఆదేశాలు జారీ చేశారు. దాంతో ఒకటెండ్రు చోట్ల తప్ప లక్ష్యం సాధ్యం కాకపోవడంతో నిబంధనల్లో వెసులుబాటు ఇచ్చినట్లుగా చెబుతున్నారు. ఈ ప్రాంతాల్లో ఎంతమేర స్థలముంటే అంతమేరకు క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నగరపాలక సంస్థ పరిధిలో 10 చోట్ల నిర్మాణ దశలో ఉండగా కొత్తగా 23 నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. దీనికోసం పట్టణ ప్రగతిలో నిధులు కూడా కేటాయించారు.



33 చోట్ల ..రూ.1.29కోట్ల నిధులు

నగరంలోని పలు డివిజన్లలో 33 చోట్ల క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయనున్నారు. దీనికోసం రూ.1.29కోట్లు కేటాయించి పరిపాలన అనుమతి ఇచ్చారు. ఇందులో ఎస్ఆర్ఆర్ కళాశాల ఆవరణలో, శాతవాహన యూనివర్సిటీ, కొత్తయాస్వాడలోని పాలిటెక్నిక్ కళాశాల, రాంనగర్ ప్రభుత్వ పాఠశాల, హౌసింగ్‌బోర్డుకాలనీ, రేకుర్తి, శివనగర్, అలుగునూర్, వివేకానందనగర్‌కాలనీ, న్యూశ్రీనగర్‌కాలనీ, ఆటోనగర్, ఏఎంసీ కిసాన్‌నగర్, పద్మానగర్, న్యూశ్రీనగర్‌కాలనీ, హస్నాపూర్ కాలనీ, కిసాన్‌నగర్ సరస్వతీనగర్, అలకాపురి, వావిలాలపల్లి, గణేశ్‌నగర్, ముకరంపుర రెవెన్యూక్లబ్ వెనుకాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల కళాశాల, పాఠశాల, రేకుర్తి ప్రభుత్వ పాఠశాల, సప్తగిరికాలనీ ప్రభుత్వ పాఠశాల, ప్రాథమిక బాలికల పాఠశాలలో ఏర్పాటు చేస్తారు.

దశల వారీగా ఏర్పాటు - వై.సునీల్‌రావు, మేయర్, కరీంనగర్

ప్రభుత్వ లక్ష్యం మేరకు క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా స్థలాలు దొరకడం లేదు. అన్ని చోట్ల స్థలాలు పరిశీలించి కనీసం 120 ప్రాంగణాలు ఉండేలా చర్యలు తీసుకుంటాం. స్థలాన్ని బట్టీ సౌకర్యాలు కల్పించడం జరుగుతుంది.

# చుక్ చుక్ బండి.. అంతటా ఆగదండి!

పెద్దపల్లి : కరీంనగర్ నుంచి పెద్దపల్లి మీదుగా మంచిర్యాలకు రహదారి మార్గంలో వెళ్తే సుమారు 84 కిలోమీటర్ల దూరానికి రెండు గంటలకు పైగా ప్రయాణించాలి. అదే రైలులో పెద్దపల్లి నుంచి మంచిర్యాలకు అర గంటలోపే చేరుకోవచ్చు. దీంతో చాలా మంది కరీంనగర్ నుంచి పెద్దపల్లి వరకు బస్సులో వచ్చి అక్కడి నుంచి అందుబాటులో ఉండే ఎక్స్‌ప్రెస్ గాని, ప్యాసింజర్ రైలు గాని ఎక్కితే మొత్తమ్మీద గంటన్నరలోనే మంచిర్యాల చేరుకోవచ్చు. అయితే ఇదంతా గతం.. దాదాపు రెండున్నరేళ్ల కిందట కరోనా వచ్చిన తర్వాత రైళ్ల వేళలన్నీ మారాయి. హాల్టింగ్, పాత మార్గాలను రద్దు చేయడంతో రైలు ప్రయాణం ప్రహసనంగా మారింది.

50 ఏళ్లుగా నడిచిన నాగ్‌పూర్(అజ్నీ) ప్యాసింజర్ రైలును రెండేళ్ల కిందట కొవిడ్ ప్రభావంతో అధికారులు రద్దు చేశారు. తాజాగా ఆగస్టు 1 నుంచి ఈ రైలును నడిపించాలని నిర్ణయించారు. అయితే కాజీపేట నుంచి బల్లార్షా వరకు మాత్రమే ఎక్స్‌ప్రెస్ రైలుగా నడిపించనున్నారు. ప్రతి రోజూ రాత్రి 10.50కి కాజీపేట జంక్షన్‌లో బయల్దేరి పెద్దపల్లికి 11.41, రామగుండానికి 11.54 వరకు చేరుకుంటుంది. మరుసటి రోజు తెల్లవారుజామున బల్లార్షా జంక్షన్‌కు 3.10కి చేరుతుంది. తిరిగి ఇదే ఎక్స్‌ప్రెస్ ఉదయం 3.50కి బల్లార్షా నుంచి రామగుండానికి ఉదయం 5.47కి, పెద్దపల్లికి 6.15కు వచ్చి, కాజీపేటకు ఉదయం 8.50కి చేరుకుంటుంది. ఇంతవరకు బాగానే ఉన్నా గతంలో కాజీపేట నుంచి నాగ్‌పూర్(అజ్నీ) వరకు నడిపిన ఈ ప్యాసింజర్‌ను ఎక్స్‌ప్రెస్‌గా మార్చడంతో పాటు బల్లార్షా వరకు మాత్రమే నడిపించాలని నిర్ణయించారు. అంతే కాకుండా పదుల సంఖ్యలోని స్టేషన్‌లలో హాల్టింగ్‌లను ఎత్తివేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బస్సు ప్రయాణం.. భారమే!

నిత్యం కరీంనగర్, నిజామాబాద్‌ల నుంచి మంచిర్యాల, బల్లార్షాలకు వెళ్లే ఉపాధ్యాయులు, ఉద్యోగులు, చిరువ్యాపారులు, సామాన్య, మధ్య తరగతి వర్గాల ప్రజలు సాధారణంగా రైలు ప్రయాణాన్నే ఎంచుకుంటారు. ఈ మార్గంలో బస్సులో వెళ్లాలంటే గంటల తరబడి ప్రయాణానికి ఒళ్లు హూనం కావాల్సిందే. అస్తవ్యస్తంగా రహదారులు, ట్రాఫిక్ రద్దీతో రోజులో సగం సమయం ప్రయాణానికే కేటాయించాల్సి వస్తోంది. ఇటీవలి కాలంలో పెరిగిన బస్సు ఛార్జీలతో ఆర్థిక భారం కూడా మామూలుగా లేదు. అదే రైలు ప్రయాణమైతే ఎక్కువలో ఎక్కువగా జనరల్ టికెట్‌కు రూ.150 లోపే ఉంటుంది. బస్సులో వెళ్తే గమ్య స్థానాలను బట్టి రూ.200కు పైగా వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా బస్సులు సమయపాలన పాటించడం లేదు. నిత్యం గోదావరిఖని, మంథని, పెద్దపల్లి, కరీంనగర్‌ల నుంచి మంచిర్యాలకు వెళ్లే బస్సులు కిటకిటలాడుతూ ఉంటాయి.

ఇక మంచిర్యాల జిల్లా పరిధిలో మంచిర్యాల, బెల్లంపల్లి స్టేషన్లలో మాత్రమే రైలును నిలపనున్నారు. దీంతో సింగరేణి, ఇతర సంస్థల ఉద్యోగులు, ఇతరులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గతంలో రవీంద్రఖని(రామకృష్ణాపూర్), మందమర్రి పట్టణాల్లో హాల్టింగ్ ఉండగా, తాజాగా దాన్ని ఎత్తివేశారు. 14 స్టేషన్లకు తగ్గిన హాల్టింగ్ కరీంనగర్ జిల్లా పరిధిలో జమ్మికుంట, పెద్దపల్లి జిల్లా పరిధిలో పొత్కపల్లి, పెద్దపల్లి జంక్షన్, రామగుండం రైల్వే స్టేషన్లలో మాత్రమే హాల్టింగ్ సౌకర్యం కల్పించారు. అజ్నీ ప్యాసింజర్‌గా కొనసాగిన కాలంలో సింగరేణీయులు, చిరు వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు, సామాన్య ప్రజలు కాజీపేట నుంచి పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల మీదుగా మహారాష్ట్ర వరకు ఇందులోనే ప్రయాణించేవారు. గతంలో 60 స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం ఉన్న ఈ రైలును ఎక్స్‌ప్రెస్‌గా మార్చడంతో పాటు కేవలం 14 స్టేషన్లలోనే నిలుపుదలకు నిర్ణయించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# అక్రమాలను అడ్డుకోండి: సీఎం జగన్‌కు చంద్రబాబు లేఖ





అమరావతి: పశ్చిమగోదావరి జిల్లా చించినాడ దళితుల భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి తెదేపా అధినేత చంద్రబాబు లేఖ రాశారు. వైకాపా ప్రజాప్రతినిధులు నిబంధనలకు విరుద్ధంగా అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నిరసనలు తెలుపుతున్న దళితులపై దాడి చేసి గాయపరిచారని మండిపడ్డారు.

దళితులపై దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలని సీఎంకు రాసిన లేఖలో చంద్రబాబు డిమాండ్ చేశారు. యలమంచిలి మండలం చించినాడ గ్రామానికి చెందిన దళితులు ఏనుగువానిలంక గ్రామంలో వారికి కేటాయించిన అసైన్డ్ భూముల్లో 60 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారని చంద్రబాబు గుర్తు చేశారు. వైకాపా ఎమ్మెల్యే ముదునూరి ప్రసాద్‌రాజు, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్ తమ అనుచరుల ద్వారా నిబంధనలకు విరుద్ధంగా దళితుల భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ తవ్వకాలను నిరసిస్తూ ఈనెల 6వ తేదీన చించినాడ దళితులు నిరసనలకు దిగితే పోలీసులు వారిపై లాఠీఛార్జ్ చేశారని మండిపడ్డారు.

తీవ్ర గాయాలైన వారిని పోలీసులు సమీపంలోని పాలకొల్లు ఆసుపత్రికి తరలించకుండా, 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారని విమర్శించారు. ఈ ఘటనలో నిందితులను రక్షించడానికి ప్రభుత్వం ఎందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. పోలీసులు అధికార పార్టీ గూండాల్లా ప్రవర్తిస్తున్న తీరు విస్మయం కలిగిస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు.

# దేశంలో అవినీతి పెరిగిపోయిందన్న మాజీ ఉపరాష్ట్రపతి



విజయవాడ: దేశంలో అవినీతి పెరిగిపోయిందని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. శనివారం ఆంధ్ర లయోల కాలేజ్ ఆడిటోరియంలో శ్రీధర్స్ సీసీఈ విజయోత్సవ సభలో వెంకయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అందరూ నీతివంతంగా ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి అవుతుందని తెలిపారు. అవినీతి నిర్మూలనలో యువత కీలకపాత్ర పోషించాలని అన్నారు. పాశ్చాత్య దేశాల ఆహారానికి అలవాటు పడటం ఆరోగ్యానికి మంచిది కాదని.. భారతదేశ ఆహార అలవాటులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సెల్‌ఫోన్‌కు యువత బానిస కాకూడదన్నారు. వ్యాయామం శరీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. రాజకీయాల నుంచి తప్పుకున్న తర్వాత ఆరోగ్యం పైన శ్రద్ధ పెట్టానని.. చదువు, వ్యాయామానికి ఎక్కువ సమయం కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లానని... అది నా జీవితాన్ని మార్చేసిందన్నారు. లాయర్ అవ్వాలి అనుకున్న తాను రాజకీయ నాయకుడిని అయ్యానని చెప్పుకొచ్చారు. ప్రతి ఒక్కరూ పనిచేసే ప్రాంతంలో, విద్యాలయాల్లో ఎక్కువ మంచి స్నేహితులను సంపాదించుకోవాలన్నారు. మాతృభూమిని, మాతృభాషని మరిచిపోయేవాడు మానవుడే కాదన్నారు. తెలుగు భాష కళ్ళు అయితే ఇంగ్లీష్ భాష కళ్లద్దాలు వంటివని తెలిపారు. ప్రతి ఒక్కరూ మన సంస్కృతి, సంప్రదాయాల పై అవగాహన పెంచుకోవాలని వెంకయ్యనాయుడు సూచించారు.

# ఆరిపోయిన పార్టీకి అధ్యక్షుడు చంద్రబాబు.. ఐటీడీపీకి ఆ సంగతి తెలియదేమో!



తాడేపల్లి: అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, ఇప్పుడు ఆయన మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఏపీ గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఆరిపోయిన టీడీపీకి చంద్రబాబు అధ్యక్షుడు.. ఆయన జీవితం గురించి 'ఐటీడీపీ'కి తెలియనట్టుంది. ఎన్టీఆర్‌ని ఎలా వెన్నుపోటు పొడిచారో కూడా తెలీదా? అంటూ మంత్రి ప్రశ్నించారు. "2014 నాటి టీడీపీ మేనిఫెస్టోలో సంవత్సరానికి 12 సిలెండర్లు ఇస్తానన్నారు. సబ్సిడీ కూడా ఇస్తానన్నారు. మరి ఎందుకు ఇవ్వలేదు?. 14,500 కోట్ల డ్వాక్రా రుణమాఫీ చేస్తానని మహిళలను నిలువునా మోసం చేశారు. హైస్కూల్ పిల్లలకు సైకిళ్లు ఇస్తానని మోసం చేశారు. నిరుద్యోగ భృతి పేరుతో యువతను మోసం చేశారు. మొదటి సంతకం చేసిన బెల్టుషాపులు కూడా ఎత్తి వేయలేదు. మంచినీళ్లు ఇవ్వలేదు కానీ ఇంటింటికీ మద్యం సరఫరా చేశారు. ఇప్పుడు కొత్తగా పీ-4 అనే మంత్రం అందుకున్నారు. మంత్రాలకు చింతకాయలు రాలతాయా చంద్రబాబూ?" అంటూ జోగి రమేష్ దుయ్యబట్టారు. "పేదలను ధనవంతులు చేస్తాడంట. పేదలకు ఇళ్లు కట్టిస్తానంటే అడ్డుకుని కోర్టులకు వెళ్లిన వ్యక్తి ఇప్పుడు ధనవంతులను ఎలా చేస్తారు?. మాట ఇస్తే ఎందాకైనా పోరాటం చేసే వ్యక్తి జగన్. ఆయన్ని చూసి చంద్రబాబు నేర్చుకోవాలి. భోగాపురం ఎయిర్ పోర్టు శరవేగంగా నిర్మాణం జరుగుతోంది. పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అదీ ప్రజల మీద జగన్‌కి ఉన్న ప్రేమ. పోలవరాన్ని ఏటీఎంలాగా వాడుకున్నది చంద్రబాబు" అని మంత్రి జోగి రమేష్ మండిపడ్డారు.

# టికెట్ కోసం జగన్‌ను ఐదుసార్లు కలిసినా ప్రయోజనం లేదు: ఎమ్మెల్యే మేకపాటి



బద్వేల్: తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌తో వైకాపా బహిష్కృత ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి భేటీ అయ్యారు. బద్వేలు నియోజకవర్గం అట్లూరులో లోకేశ్ యువగళం పాదయాత్రకు మేకపాటి సంఘీభావం తెలిపారు. ఈ నెల 13న ఉమ్మడి నెల్లూరు జిల్లాలోకి యువగళం పాదయాత్ర ప్రవేశించనున్న నేపథ్యంలో తాజా రాజకీయ పరిణామాలపై లోకేశ్‌తో చర్చించారు. మేకపాటితో పాటు బద్వేల్‌కు చెందిన తెదేపా నేతలు కూడా లోకేశ్‌ను కలిశారు. అనంతరం మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. "నారా లోకేశ్‌ను కలిసి తాజా రాజకీయ పరిణామాలపై సుదీర్ఘంగా చర్చించా. పాదయాత్ర ఉదయగిరిలోకి ప్రవేశిస్తున్న నేపథంలో ఆయన్ని ఆహ్వానించాలని ఇక్కడికి వచ్చాను. నా నియోజకవర్గంలో పాదయాత్రను విజయవంతం చేస్తాం. జగన్‌మోహన్ రెడ్డిని టికెట్ కోసం ఐదు సార్లు కలిసినా లాభం లేదు. ఎమ్మెల్సీ పదవి మాత్రమే ఇస్తానని హామీ ఇచ్చారు. ఇక లాభం లేదనుకొని పార్టీ నుంచి బయటికి వస్తున్నాను. త్వరలోనే తెలుగుదేశం పార్టీలో చేరతాను. నాతోపాటు నెల్లూరు జిల్లా నుంచి మరో ఇద్దరు ఎమ్మెల్యేలు తెలుగుదేశం పార్టీలో చేరతారు. వచ్చే ఎన్నికల్లో తెదేపా నుంచి టికెట్ ఇస్తే పోటీ చేస్తా. ఇవ్వకపోయినా పార్టీ కోసం పని చేస్తా. ఉదయగిరి నియోజకవర్గంలో నేను, వెంకటగిరిలో ఆనం రామనారాయణరెడ్డి లోకేష్ పాదయాత్రను ఆహ్వానిస్తాం" అని మేకపాటి పేర్కొన్నారు.

# భాజపా అసహనానికి ఇదే నిదర్శనం: చిదంబరం



దిల్లీ: ఒడిశా రైలు ప్రమాదంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి ఇటీవల లేఖ రాశారు. దీన్ని కర్ణాటకకు చెందిన నలుగురు భాజపా ఎంపీలు తీవ్రంగా విమర్శించారు. భాజపా ఎంపీల విమర్శలపై తాజాగా కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం తీవ్రంగా స్పందించారు. భాజపా ఎలాంటి విమర్శలను సహించలేదని చెప్పడానికి ఇదే నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఖర్గే రాసిన లేఖకు ప్రతిస్పందనగా భాజపా ఎంపీలు విడుదల చేసిన లేఖలో ఎలాంటి వాస్తవాలు లేవని అన్నారు.

సీబీఐ ఉన్నది నేరాలపై విచారణ జరపడానికని ప్రధానికి రాసిన లేఖలో ఖర్గే అన్నారు. రైలు ప్రమాద ఘటనలపై దర్యాప్తు చేయడం సీబీఐ పని కాదన్నారు. సాంకేతిక, వ్యవస్థాగత, రాజకీయ వైఫల్యాలను సీబీఐ తేల్చలేదన్నారు. అలాగే రైల్వే భద్రతకు అనేక చర్యలు తీసుకుంటున్నామంటూ ఇప్పటి వరకు చెబుతూ వచ్చిన ప్రభుత్వ డొల్లతనం తేటతెల్లమైందని విమర్శించారు. దీనిపై భాజపా ఎంపీలు తేజస్వీ సూర్య, పీసీ మోహన్, మునిస్వామి, సదానంద గౌడ ఘాటుగా స్పందించారు. వాట్సప్ యూనివర్సిటీ నుంచి వచ్చిన సమాచారంతో ప్రధానికి లేఖ రాయడం ఖర్గే స్థాయి నేతకు తగదని విమర్శించారు. భాజపా ఎంపీల విమర్శలపై చిదంబరం స్పందిస్తూ.. ఇది భాజపా అసహనానికి నిదర్శనమని పేర్కొన్నారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా ప్రధానికి లేఖ రాసే హక్కు ఖర్గేకు ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో అలాంటి లేఖలకు ప్రధాని స్వయంగా స్పందిస్తారని ప్రజలు ఆశిస్తారని అన్నారు. కానీ, మన ప్రజాస్వామ్యంలో మాత్రం ఇలాంటి లేఖలకు బదులివ్వడం తగదని ప్రధాని భావిస్తారని విమర్శించారు. పైగా దీన్ని భాజపా ఎంపీలు తమ భుజాలపై వేసుకొని స్పందించడం ఏమాత్రం సరికాదని అన్నారు.



# 24 గంటల్లో మరింత తీవ్ర తుపానుగా..

ముంబయి: అరేబియా సముద్రంలో ఏర్పడిన 'బిపోర్‌జాయ్' తుపాను మరో 24 గంటల్లో మరింత తీవ్ర రూపం దాల్చనున్నట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. ఇది మరింత బలపడి ఉత్తర-ఈశాన్య దిశగా కదులుతుందని వెల్లడించింది. ఇది ప్రస్తుతం గోవాకు పశ్చిమాన 690 కి.మీ దూరంలో, ముంబయికి పశ్చిమ-నైరుతి దిశలో 640 కి.మీలో కేంద్రీకృతమై ఉంది. తుపాను ప్రభావంతో కర్ణాటక, గోవా, మహారాష్ట్రలోని తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. బలమైన ఈదురు గాలులు కూడా వీస్తాయని తెలిపింది. భారీ అలల కారణంగా గుజరాత్‌లోని ప్రముఖ పర్యాటక ప్రదేశం తితాల్ బీచ్‌ను ఈ నెల 14 వరకూ మూసివేస్తున్నట్లు స్థానిక అధికారులు తెలిపారు. తుపాను కారణంగా జూన్ 10 నుంచి 12 వరకు 45 నుంచి 55 కిలోనాట్స్ వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని.. ఇవి 65 కిలోనాట్స్ వరకూ చేరవచ్చని అధికారులు తెలిపారు.

దీంతో అరేబియా సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.



# నెల్లూరులో హీటెక్కిన రాజకీయాలు

నెల్లూరు: నెల్లూరు జిల్లాలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. మాజీ మంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రాంనారాయణ రెడ్డి శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుతో భేటీ కావడం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దాదాపు గంట పాటు చంద్రబాబు, ఆనం భేటీ అయ్యారు. నెల్లూరు జిల్లాలో రాజకీయ పరిస్థితులపై వీరిద్దరూ ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారనే అభియోగంపై ఆనంను వైకాపా నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. చంద్రబాబుతో భేటీ అనంతరం ఇవాళ ఆనం హైదరాబాద్ నుంచి నెల్లూరుకు చేరుకున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా తెదేపా నేతలు నెల్లూరులో ఆనంతో సమావేశమయ్యారు. ఆయన ఇంట్లో ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, జిల్లాలోని తెదేపా సీనియర్ నేతలు, తదితరులు హాజరయ్యారు. నెల్లూరులో లోకేశ్ యువగళం పాదయాత్ర స్వాగత ఏర్పాట్లపై భేటీలో చర్చించారు. తెదేపా నేతలతో భేటీ అనంతరం ఆనం మీడియాతో మాట్లాడుతూ.. "తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర నెల్లూరులో మొదలు కాబోతుంది. నిన్న పార్టీ అధినేత చంద్రబాబుతో మాట్లాడాను. నెల్లూరు జిల్లాలో లోకేష్ పాదయాత్రను విజయవంతం చేస్తాం. లోకేశ్ పాదయాత్ర నిర్వహణపై ప్రణాళిక వేశాం. అందరం కలిసి పార్టీని బలోపేతం చేస్తాం. జిల్లాలో పాదయాత్ర పూర్తికాగానే తెదేపా సభ్యత్వం తీసుకుంటా. నెల్లూరు జిల్లాలో యువగళం పాదయాత్రను విజయవంతం చేస్తాం" అని ఆనం వెల్లడించారు. మీడియాతో మాట్లాడిన అనంతరం నేతలంతా ఆనంతో కలిసి జిల్లా పార్టీ కార్యాలయానికి బయలుదేరారు. అక్కడ ఆత్మకూరు నియోజకవర్గ తెదేపా-వైకాపా కార్యకర్తలు ఆనంతో సమావేశం కానున్నారు. వెంకటగిరి, నెల్లూరు, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని తన అనుచరులతో ఆనం రేపు భేటీ కానున్నట్లు సమాచారం.

# వైకాపా ఇసుక మాఫియాకు ఇదే ప్రత్యక్షసాక్ష్యం: నారా లోకేశ్ సెల్ఫీ



రాజంపేట: ప్రజల సంక్షేమం, అభివృద్ధిని విస్మరించి రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి దోపిడీకే ప్రాధాన్యమిస్తున్నారని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. యువగళం పాదయాత్ర 122వ రోజు అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గంలోని జంగాలపల్లె విడిది కేంద్రం నుంచి ప్రారంభమైంది. ఈ క్రమంలో సిద్దవటం మండలం జంగాలపల్లెకు చేరుకున్న లోకేశ్.. పెన్నానదిని తోడేసి వైకాపా ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి అనధికారికంగా పోగేసిన ఇసుక డంపింగ్ యార్డుతో సెల్ఫీ దిగారు. లోకేశ్ మాట్లాడుతూ.. "పెన్నానది పక్కనే ఉన్నా స్థానిక ప్రజలకు మాత్రం ఇసుక అందుబాటులో ఉండటం లేదు. బెంగుళూరు, హైదరాబాద్ నగరాలకు ఇక్కడి ఇసుకను తరలించి కోట్లాది రూపాయలు దోచుకుంటున్నా ఎస్ఈబీ అధికారులకు కనపడదు. జగన్ రెడ్డి పాపాలపుట్ట మాదిరి పెరిగిపోతున్న ఈ ఇసుక మేట రాష్ట్రంలో పేట్రేగిపోతున్న ఇసుక మాఫియాకు ప్రత్యక్షసాక్ష్యం" అని వ్యాఖ్యానించారు. మరోవైపు వైకాపా బహిష్కృత ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి లోకేశ్‌తో భేటీ అయ్యారు.

కడప జిల్లా బద్వేలు నియోజకవర్గం అట్లూరులో యువగళం పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. తాజా రాజకీయ పరిణామాలపై లోకేశ్‌తో చర్చించారు. మేకపాటితో పాటు బద్వేల్‌కు చెందిన తెదేపా నేతలు కూడా లోకేశ్‌ను కలిశారు. ఈనెల 13న ఉమ్మడి నెల్లూరు జిల్లాలోకి యువగళం పాదయాత్ర ప్రవేశించనుంది.



# తెదేపా నేతల పోలవరం పర్యటన పోలీసుల అడ్డగింత

గోపాలపురం: పోలవరం పర్యటనకు వెళ్తున్న తెలుగుదేశం పార్టీ నేతల బృందాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఏలూరు నుంచి గోపాలపురం మీదుగా పోలవరం బయలుదేరిన తెదేపా నేతలను కొవ్వూరుపాడు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, నిమ్మల రామానాయుడు, గన్ని వీరాంజనేయులు, బడేటి రాధాకృష్ణ, పార్టీ నేతలను పోలీసులు నిలువరించారు. దీంతో తెదేపా నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం నెలకొనడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అదుపులోకి తీసుకొనే సమయంలో తెదేపా నేతలు ప్రతిఘటించడంతో పోలీసులు వారిని బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించారు.

పోలీసులను దాటుకొని ద్విచక్రవాహనంపై పోలవరం బయలుదేరిన మాజీ మంత్రి దేవినేని ఉమను పోలీసులు అదుపులోకి తీసుకొని కొట్టాయిగూడెం పీఎస్‌కు తరలించారు. తెదేపా నేతలను గోపాలపురం పోలీసుస్టేషన్‌కు తరలించారు. మరోవైపు తెదేపా నేతలు పోలవరం వస్తున్నారనే సమాచారంతో అడ్డుకోవడానికి పోలవరం వద్ద పోలీసులు భారీగా మోహరించారు.



# వైసీపీ ఎమ్మెల్యే పార్థసారథికి అస్వస్థత

విజయవాడ: మాజీ మంత్రి, పెనమలూరు వైసీపీ ఎమ్మెల్యే పార్థసారథి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పార్థసారథి అస్వస్థతతో పడిపోవడంతో వెంటనే కుటుంబసభ్యులు ఆయనను ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యేను పరీక్షించిన వైద్యులు ఆయనకు గుండెపోటు వచ్చిందని నిర్ధారించారు. అశోక్‌నగర్‌లోని టాప్ స్టార్ హాస్పటల్‌లో పార్థసారథికి వైద్యులు చికిత్స చేశారు. వైసీపీ ఎమ్మెల్యేకు యాంజియోగ్రామ్ చేసి స్టంట్ వేశారు. ప్రస్తుతం పార్థసారథి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పార్థసారథి అస్వస్థతకు గురైన విషయం తెలిసి వైసీపీ నేతలు, కార్యకర్తలు ఆస్పత్రికి చేరుకుంటున్నారు.

## తెల్లగా కనిపించేందుకు సర్జరీ చేయించుకుందా...?

బాలీవుడ్ లో సుదీర్ఘ కాలంగా హీరోయిన్ గా కొనసాగుతున్న ముద్దుగుమ్మ కాజోల్ కెరీర్ ఆరంభంలో నల్లగా ఉండేది. ఆ విషయాన్ని ఆమె కూడా ఒప్పుకుంటుంది. తాను గతంలో నల్లగా బండగా ఉన్నానంటూ కొందరు విమర్శించే వారు. ఆ సమయంలో కొందరు నేను తెల్లగా కనిపించేందుకు సర్జరీ చేయించుకున్నాను అంటూ ప్రచారం చేశారు. తెల్లగా కనిపించేందుకు సర్జరీ చేయించుకుంది అంటూ వస్తున్న వార్తలపై కాజోల్ తాజాగా మరోసారి స్పందించింది. ఇటీవల ఒక సందర్భంగా కాజల్ మాట్లాడుతూ... తాను తెల్లగా కనిపించేందుకు ఎలాంటి సర్జరీలు చేయించుకోలేదు. అయితే ఒకప్పుడు



ఎండకు వెళ్లినట్లుగా ఇప్పుడు ఎండకు వెళ్లడం లేదని చెప్పుకొచ్చింది. ఎండుకు వెళ్లిన సమయంలో మొహం పై ట్యాన్ ఏర్పడుతుంది. ఇప్పుడు పూర్తిగా ఇంటికే పరిమితం అవ్వడం వల్ల ట్యాన్ ఏర్పడడం లేదని.. అందుకే తెల్లగా కనిపిస్తున్నాను అంటూ చెప్పుకొచ్చింది.

సోషల్ మీడియాలో కాజోల్ యొక్క సమాధానంను పలువురు పలు రకాలుగా విశ్లేషిస్తున్నారు. ఒకప్పుడు షూటింగ్స్ కోసం ఎక్కువగా ఔట్ డోర్ వెళ్లవలసి వచ్చేది. అందుకే కాజోల్ నల్లగా ఉండేది. కానీ ఇప్పుడు షూటింగ్స్ కు అసలు కాజోల్ బయటకు వెళ్లే పరిస్థితి లేదు. కనుక ఆమె తెల్లగా ఉందని ఆమె సన్నిహితులు కూడా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## అందాల ఆరబోతతో అదరగొడుతున్న కృతి సనన్..!

వన్ నేనొక్కడినే సినిమాతో సినీ రంగంలో అడుగు పెట్టిన కృతి సనన్ గురించి తెలుసు సినీ ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మొదటి సినిమాతోనే విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు అందుకుంది. కొత్త నటి అనే ఫీలింగ్ ఏమాత్రం రానీయకుండా అద్భుతంగా నటించి మెప్పించిందీ ముద్దుగుమ్మ. కానీ ఆ తర్వాత నుంచి ఈమె నటించినా ఏ సినిమాలు హిట్టు కాలేదు. కాగా ప్లాపులు గా నిలిచాయి. కరోనా విపత్తుకు ముందు అంటే 2019 డిసెంబర్ 6వ తేదీన రిలీజ్ అయిన పానిపట్ చిత్రం నుంచి ఈమె కెరియర్ గ్రాఫ్ కిందికి పడిపోవడం మొదలైంది. 2021లో ఓటీటీ వేదికగా విడుదలైన సూపర్ డూపర్ సినిమా మిమిలోనూ ఈ ముద్దుగుమ్మ నటనకు మంచి మార్కులే పడ్డాయి. కేవలం సినిమాల



ద్వారానే కాకుండా ఈ క్యూట్ బ్యూటీ సోషల్ మీడియాలోనూ చాలా యాక్టివ్ గా ఉంటుంది. తన పర్సనల్ లైఫ్ తో పాటు ప్రొఫెషనల్ లైఫ్ కు సంబంధించిన అనేక విషయాలను తన అభిమానులతో పంచుకుంటుంది. ఓ వైపు అదిరిపోయే ఔట్ ఫిట్లతో అందాలు ఆరబోస్తూనే.. నెట్టింట తెగ రచ్చ చేస్తుంటుంది. అయితే తాజాగా ఈ ముద్దుగుమ్మ ఇన్ స్టా వేధికగా కొన్ని ఫొటోలను షేర్ చేసింది. అందులో అదిరిపోయే ఔట్ ఫిట్ తో దర్శనం ఇచ్చింది. లాంగ్ స్లైడ్ స్లిట్ డ్రెస్సులో అదిరిపోయే ఫోజులు ఇచ్చింది. థైస్ అందాలతో పాటు నడుము ఎద కనిపించేలా ఫొటోలు దిగింది. తలకు చేయి పెట్టుకొని కాస్త కాలు పైకెత్తి.. హై హీల్స్ లో దర్శనం ఇచ్చింది. ఈ ఫొటోలు చూసిన కుర్రకారు పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నారు. కరెంటు తీగలా కనిపించే కృతి అందాలు చూస్తే.. ఎవ్వరైనా సరే ఫిదా కావాల్సిందే అంటూ చెప్పుకొస్తున్నారు. లక్షలాది మందికి క్రష్ గా మిగిలిన కృతి సనన్ పై ప్రతీ ఒక్కరికీ విపరీతమై ప్రేమ అని చెప్పుకొచ్చారు. నీ థైస్ నడుము ఎద అందాలు చూసేందుకు నిన్ను ఫాలో అవుతున్నామంటూ కామెంట్లు చేశారు. ఏది ఏమైనా నిన్ను మించిన అందం ఈ లోకంలో లేదంటూ మరికొంత మంది రాసుకొచ్చారు.




## కృతిశెట్టి ఎంట్రీతో ఆ భామని పక్కకు తొసేసారా?





కోలీవుడ్ లో అప్పుడే కృతిశెట్టి డామినేషన్ మొదలైం దా? నటించింది ఒక్క సినిమా అయినా? అప్పుడే డామినేషన్ ఏంటి ? అనుకుంటున్నారా? అయితే అసలు మ్యాటర్లోకి వెళ్లాల్సిందే. 'ది వారియర్' సినిమాతో అమ్మడు కోలీవుడ్ లో పరిచయమైంది. సినిమా ఫలితం సంగతి పక్కనబెడితే బ్యూటీకి తమిళ తంబీలు బాగానే కనెక్ట్ అయ్యారు. క్యూట్ క్యూట్ ఎక్స్ ప్రెషన్స్ అక్కడి యువతని బాగానే ఆకట్టుకున్నాయి. వారియర్ రిలీజ్ కి ముందు తమిళ ఇంటర్వ్యూలు కృతికి మంచి గుర్తింపు ని తీసుకొచ్చాయి. అందులోనూ ఓ ఇంటర్వ్యూ లో కన్నీరు పెట్టుకున్న వీడియో ఏకంగా కోలీవుడ్ మీడియాలో వైరల్ గా మారింది. చేసింది తెలుగు హీరో సినిమా అయినా ? తమిళ హీరో సరసన చేస్తున్నంతగా పాపులర్ అయింది. ఇప్పుడీ బ్యూటీ కార్తీ కథానాయకుడిగా నలన్ కుమార్ స్వామి దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రంలో సెకెండ్ లీడ్ కి ఎంపికైంది. హీరో పాత్ర సహా స్టోరీ సెకెండ్ లీడ్ కూడా డిమాండ్ చేయడంతో కృతి శెట్టిని తీసుకున్నారు. ఇక మెయిన్ లీడ్ కి గాయత్రి భరద్వాజని ఎంపిక చేసారు. కార్తీ సరసన కనిపించే ప్రధానమైన రోల్ ఇది. కార్తీతో ఎక్కువ సన్నివేశాలు గాయత్రి పాత్రకున్నాయి. అయితే అనూహ్యంగా ఇప్పుడా పాత్ర బాధ్యతలు సెకెండ్ లీడ్కి ఎంపికైన కృతి శెట్టిని తీసుకుంటే బాగుంటుందని భావించి రీప్లేస్ చేసినట్లు తాజా సమాచారం. దీంతో గాయత్రి ..కృతిశెట్టి పాత్రలు తర్జుమా అయినట్లు తెలుస్తుంది. ఇది గాయత్రికి షాకింగ్ అయినా ఎలాంటి భేషజాలం చూపించకుండా సెకెండ్ లీడ్ అయినా సరే సిద్దంగానే ఉందని సమాచారం. ఆ రకంగా కృతి శెట్టి ఎంట్రీతో మొదటి నాయికకే ఎసరు పెట్టినట్లు కనిపిస్తుంది. సాధారణంగా ఇలాంటి సన్నివేశం ఎదురైనా మరో నటి అయితే? సినిమా నుంచి తప్పుకోవడమో! మీడియాకి ఎక్కి రచ్చ చేయమడో చేస్తుంది. కానీ గాయత్రి ఆ తరహా నటి కాదని తన హుందాతనంతోనే చాటి చెబుతుంది. గాయత్రి కూడా రీసెంట్ గానే కెరీర్ ప్రారంభించింది. వచ్చిన అవకాశాల్ని సద్వినియోగం చేసుకుంటుంది.

## పారీ పెళ్లి ముచ్చట సరే.. ఇంతకీ ఈ సంగతి తెలుసా?



పస్తుతం ఏ నోట విన్నా పరిణీతి పెళ్లి గురించే ముచ్చట. త్వరలోనే ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకుడు రాఘవ్ చద్దాను పరిణీతి చోప్రా పెళ్లాడేయబోతోందని పుకార్లు షికార్ చేస్తున్నాయి. ఏడాది చివరిలో ఈ జంట పవిత్ర వివాహంతో ఒకటి కాబోతున్నారు. వారి ప్రేమ వ్యవహారం గురించి పెదవి విప్పకపోయినా కానీ.. కలిసి లంచ్ లు- డిన్నర్ డేట్ లు.. విందు ఏర్పాట్లు ఈ పుకార్లను నిజం చేస్తున్నాయి. అదంతా అటుంచితే.. పరిణీతి చోప్రా ప్రపంచ యాత్రికురాలిగా అభిమానులకు సుపరిచితం. ఇంతకుముందు పారీ ఆస్ట్రేలియా యూరప్ పర్యటనలు వైరల్ అయ్యాయి. అయితే తన ప్రయాణాల్లో తనకు ఎదురైన అనుభవాల గురించి పారీ ఇప్పుడు మాట్లాడింది. మనం ఎక్కడికి వెళ్లినా చిరునవ్వుతో సరదాగా సంభాషించే తోటివారు కనిపిస్తారని... ప్రపంచం చిన్న చిన్న దయతో కూడుకున్నదని ప్రతి విహారంలో నేర్చుకున్నానని తెలిపింది. దయ అనేది చాలా దేశాలలో కనిపించే కామన్ లక్షణం అని నేను నమ్ముతున్నాను. అపరిచితులు సహాయం చేయడం. వసతి- భోజనం అందించడం .. నెట్ వర్క్ లు.. రోడ్లు లేదా రవాణా అందుబాటులో లేని సమయంలో బ్యాగులు మోయడంలో సాయపడడం.. ప్రపంచంలో ఎంత దయ ఉందో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. నేను కూడా ఎవరితో అయినా దయతో ప్రవర్తించేందుకు ప్రాధాన్యత ఇస్తాను. ఇతరులు తప్పులు చేసినప్పుడు క్షమించాలి"అని తెలిపింది . ఏప్రిల్ 2023 'లైఫ్ స్టైల్ ఆసియా' కవర్ స్టార్ గా పరిణీతి చోప్రా ఇంకా తన యాత్రల గురించి ఆసక్తికర సంగతులు చెప్పారు. ఇక పరిణీతి జీవితంలో సెటిలవ్వడం ఒక్కటే చర్చగా మారుతోంది. మొన్న ఫిబ్రవరిలో పరిణీతి ఓ ఇంటర్వ్యూలో వివాహం -పిల్లలను కనడం గురించి ఓపెనైంది. మీరు చేయాల్సిందల్లా నాకు వరుడిని కనుక్కోవడమే..మీరు ఏవైనా సిఫార్సులు చేస్తే వింటున్నాను. నా డ్రీమ్ బోయ్ ని కనుగొని ప్రేమలో పడిన రోజు వివాహం చేసుకోవాలనుకుంటున్నాను... అని పేర్కొంది. నేను అందరిలాగే పెళ్లి చేసుకుని పిల్లలను కలిగి ఉండాలనుకుంటున్నాను. నేను హెచ్చు తగ్గులతో కూడిన గొప్ప బ్యాలెన్స్ డ్ కెరీర్ ను కలిగి ఉండాలనుకుంటున్నాను. గెలుపోటములను సమానంగా స్వాగతిస్తున్నాను. నా కుటుంబం.. నా స్నేహితులతో సంతోషంగా ఆరోగ్యంగా ఉండాలనుకుంటున్నాను.. అని పారీ ముచ్చటించింది. ప్రస్తుతం పారీని పెళ్లాడే వరుడు ఆప్ నాయకుడు రాఘవ్ ఇంతకుముందు తమపై పుకార్లను ప్రస్తావించారు. తాము స్నేహితులం అని.. తరచుగా కలుసుకుంటామని తెలిపారు. దయచేసి నన్ను రాజకీయాల గురించి ప్రశ్నలు అడగండి.. పరిణీతి గురించి అడగొద్దు! అని కోరారు. అయితే ఈ జంట పెళ్లి గురించి చాలా విషయాలను మీడియా తవ్వి తీస్తోంది. ఈ సెలబ్రిటీ పెళ్లికి సంబంధించి అధికారిక అప్ డేట్ రావాల్సి ఉంది.

## వరసగా అర డజను హిట్లు కొట్టా.. ఒకటీ అరా ఫ్లాపులొస్తే నష్టమేంటి?

2022 బుట్టబొమ్మకు ఒక పీడ కల లాంటిది. ఆ ఏడాది నటించిన భారీ చిత్రాలన్నీ డిజాస్టర్లుగా మిగిలాయి. వీటిలో రాధేశ్యామ్- ఆచార్య- సర్కస్- బీస్ట్ లాంటి భారీ చిత్రాలున్నాయి. ప్రభాస్ - రామ్ చరణ్- రణవీర్- విజయ్ లాంటి అగ్ర కథానాయకులతో వరుస ఆఫర్లు తన లెవల్ ని మరో రేంజుకు తీసుకెళతాయని భావించింది. కానీ తానొకటి తలిస్తే దైవమొకటి తలచిన చందంగా అయ్యింది. వీటన్నిటిపైనా పూజా భారీ హొప్స్ పెట్టుకుని పరాజయాల్ని చవిచూసింది. జయాపజయాలతో సంబంధం లేకుండా అవకాశాలు తనని వరిస్తున్నా తాను భారీ ఫ్లాప్ లలో నటించడం తనని కంగారు పెట్టిందా? అంటే తాజా చాటింగ్ సెషన్ లో షాకిచ్చే జవాబిచ్చింది అమ్మడు. తాజాగా వరుస వైఫల్యాల గురించి పూజా ఒక ఇంటర్వ్యూలో తన మనసులో ఉన్న మాట చెప్పేసింది. "జయాపజయాలు అనేవి వృత్తిలో భాగం. అయినా పరాజయం పాలైంది నేను కాదు.. సినిమాలు



మాత్రమే బాగా ఆడలేదు"అని స్పష్టం చేసింది. ఫ్లాపైన సినిమాలకు తాను దర్శకురాలినో లేకపోతే ఎడిటర్ నో కాను అని నటిగా సత్తా చాటానని చెప్పింది. సినిమలు ఫ్లాపైనా నా నటనకు విమర్శలు రాలేదని అద్భుతమైన ప్రశంసలు అందుకున్నానని కూడా పూజా వెల్లడించింది. తెరపై తాను కనిపించిన తీరు నటన గురించి అందరూ ప్రశంసించారని పూజా తెలిపింది. వరుస చిత్రాల పరాజయాలు తనను ప్రభావితం చేయలేదని ఈ అనుభవాల నుండి తాను చాలా నేర్చుకున్నానని చెప్పింది. తన ఖాతాలో బ్లాక్ బస్టర్ల గురించి ఈ సందర్భంగా ప్రస్థావించిన పూజా ఒకానొక సమయంలో వరుసగా ఆరు బ్లాక్ బస్టర్ లు సాధించానని ఇప్పుడు ఒకటీ అరా ఫ్లాపులొస్తే నష్టమేంటి? అని కూడా ప్రశ్నించింది. కిసీ కా భాయ్ కిసీ కి జాన్ చిత్రంతో విజయం అందుకుంటానని కూడా పూజా ధీమాను కనబరుస్తోంది. ఈ బ్యూటీ ఇందులో ఒక తెలుగమ్మాయిగా కనిపించనుంది. ఈద్ కానుకగా ఈ చిత్రం విడుదల కానుంది. సల్మాన్ ఖాన్- వెంకటేష్ కీలక పాత్రలు పోషించగా భాయ్ సరసన పూజా నటించింది. రామ్ చరణ్ అతిథిగా ఓ పాటలో మెరుస్తారు. మహేష్ సరసన త్రివిక్రమ్ సినిమాలో పూజా కథానాయిక. అలాగే తదుపరి ఓ రెండు సినిమాల గురించి చర్చలు సాగిస్తున్నానని పూజా తెలిపింది.

## ఆ నడుము మడతలో పనసతొనలు ఊరిస్తుంటే

కన్నడ బ్యూటీ శాన్వి శ్రీవత్సవ లవ్ లీ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఆది సాయికుమార్ సరసన దర్శకురాలు బి.జయ ఈ క్యూట్ బ్యూటీని తెరకు పరిచయం చేసారు. లవ్ లీ లుక్స్ తో కుర్రకారు గుండెల్ని మెల్ట్ చేసిన శాన్వీ తొలి ప్రయత్నం ట్రెడిషనల్ గాళ్ గా కనిపించింది. ఆ తర్వాత విష్ణు సరసన ఆర్జీవీ డైరెక్షన్ లో ఎటాక్ సినిమాలో నటించింది. గ్లామర్ ఎలివేషన్ పరంగా హద్దులు చెరిపేసి చెలరేగిపోయింది. అయినా ఆ సినిమా ఆశించిన విజయం సాధించలేదు. ఆ తర్వాతి కాలంలో శాన్వీ పూర్తిగా కన్నడ పరిశ్రమకే అంకితమైంది. బహుభాషా చిత్రం శ్రీమన్నారాయణలో నాయికగా నటించి మెప్పించింది. సోషల్ మీడియాల్లో ఈ భామ జరంత స్పీడ్ గానే ఉంది. ఇన్ స్టాలో నిరంతరం ఫోటోషూట్లు షేర్




చేస్తూ ఫాలోయింగ్ ఏమాత్రం తగ్గకుండా కాపాడుకుంటోంది. చిట్టి పొట్టి నిక్కర్లు బికినీలతో కుర్రకారు మతులు చెడగొడుతోంది. ఇప్పటికే ఇన్ స్టాలో లక్షలాదిగా ఫాలోవర్స్ ని సంపాదించింది. ప్రతిసారీ ఏదో ఒక కొత్తదనం నిండిన కాన్సెప్ట్యువల్ ఫోటోషూట్ తో శాన్వీ ఆకట్టుకుంటోంది. శాన్వి తాజా ఫోటోషూట్ అభిమానుల్లోకి వైరల్ గా దూసుకెళుతోంది. అలా అందంగా చీర రవికెలో బాపు బొమ్మనే తలపిస్తోంది. ఇంతకీ గడియారాల షాపులో ఏం చేస్తోందో కానీ .. మరీ అంతగా ఎదురు చూపులు ఎవరి కోసమో.. ఇంతకీ ఆఫోజేమిటో... అలా నడుము మడతలో పనసతొనలు ఊరిస్తుంటే కుర్రకారు పరేషాన్ అయిపోతూ సోషల్ మీడియాల్లో కామెంట్లు చేస్తున్నారు.క్యూట్ బ్యూటీ ఇంకా కెరీర్ విషయంలో కాన్ఫిడెంట్ గా ఉంది. కన్నడలో అవకాశాలు అందుకుంటోంది. ప్రస్తుతం త్రిశూలం - బ్యాంగ్ అనే రెండు కన్నడ చిత్రాల్లో నటిస్తోంది. మహావీర్యార్ చిత్రంతో మలయాళంలోను అడుగుపెట్టింది. తదుపరి ఓ వెబ్ సిరీస్ కోసం కథ వింటోందని తెలిసింది.



# మందికి పుట్టిన బిడ్డ మాదే అని ముద్దాడినట్లుగా బీజేపీ పరిస్థితి: మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్: హైదరాబాద్ నీటి కష్టాలను సీఎం కేసీఆర్ తీర్చారని మంత్రి హరీశ్ రావు అన్నారు. గతంలో తాగునీటి కోసం దివంగత ఎమ్మెల్యే పీ. జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలు ధర్నాలు చేశారు, కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితులు తెలంగాణలో లేవన్నారు. మహారాష్ట్రలో తొమ్మిది రోజులకు ఒకసారి నీళ్లు వచ్చే ప్రాంతాలు కూడా ఉన్నాయని చెప్పారు. హైదరాబాద్‌లోనే కాదు.. పల్లెల్లో కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ 24 గంటలు కరెంటు ఇస్తున్నారని తెలిపారు. దీంతో ఇన్వర్టర్లు, కన్వర్టర్లు, జనరేటర్లు కనిపించకుండా పోయాయన్నారు. హైదరాబాద్ కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో 100 పడకల దవాఖాన నిర్మాణానికి మంత్రి హరీశ్ రావు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ రాకముందు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు 30 శాతం ఉంటే, ప్రస్తుతం అవి 70 శాతానికి చేరాయన్నారు. మనవద్ద అల్లావుద్దీన్ అద్భుత దీపం లేదని, కష్టపడి పనిచేస్తేనే ఇదంతా సాధ్యమయిందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో 20 ఏండ్లకు ఒక్క మెడికల్ కాలేజీ పెట్టారని, కానీ పోరాడి సాధించుకున్న తెలంగాణలో తొమ్మిదేండ్లలోనే 21 వైద్య కళాశాలలు ప్రారంభించుకున్నామని చెప్పారు. గతంలో వైద్యవిద్య కోసం ఉక్రెయిన్, చైనా వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, దీంతో డాక్టర్ల కొరత అధికంగా ఉండేదన్నారు. నాడు ఎంబీబీఎస్ సీట్లు 2,950 ఉంటే నేడు 8,340 సీట్లు ఉన్నాయన్నారని, ఇకపై మన బిడ్డలు ఇక్కడే డాక్టర్లు కావొచ్చని స్పష్టం చేశారు. మెడికల్ కాలేజీలు తామే ఇచ్చినట్లు బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి హరీశ్ రావు విమర్శించారు. ఒక్కో మెడికల్ కాలేజీకి తెలంగాణ ప్రభుత్వం రూ.500 కోట్లు ఖర్చు చేస్తున్నదని వెల్లడించారు. కమలం పార్టీది జూటా ప్రచారమని, ఇంత దారుణం మరెక్కడా ఉండదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మందికి పుట్టిన బిడ్డ మాదే అని ముద్దాడినట్టు బీజేపీ పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. దేశవ్యాప్తంగా మోదీ ప్రభుత్వం 157 మెడికల్ కాలేజీలు ఇస్తే అందులో తెలంగాణకు ఒక్కటి కూడా లేదన్నారు. వచ్చే నెల 14 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా న్యూట్రిషన్ కిట్‌ను అందించబోతున్నామని మంత్రి అన్నారు. ఎవరూ అడగక ముందే సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. తల్లి బలంగా ఉంటే పుట్టబోయే బిడ్డ కూడా బాగుంటుందని వెల్లడించారు. ఇది తల్లి, బిడ్డలకు సీఎం కేసీఆర్ అందిస్తున్న కానుక అని తెలిపారు. పుట్టుక నుంచి చావుదాకా ప్రజలకు ఏం కావాలో ఆలోచించింది సీఎం కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. బీజేపీ మంత్రులు ఢిల్లీలో అవార్డులు ఇస్తారని, గల్లీలో తిడుతున్నారని విమర్శించారు. దీనిపై ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని, పని చేసేవారిని ఆశీర్వదించాలని కోరారు.

# ప్రజలే కేంద్రంగా సాగిన తెలంగాణ సంస్కరణల పథం..

## యావత్ భారతావనికే ఓ పరిపాలనా పాఠం: మంత్రి కేటీఆర్

హైదరాబాద్: స్వపరిపాలనా ఫలాలనే కాదు.. సుపరిపాలనా సౌరభాలను సమాజంలోని ప్రతి వర్గానికి తెలంగాణ ప్రభుత్వం సగర్వంగా అందిస్తున్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. తొమ్మిదేండ్ల తెలంగాణ ప్రస్థానంలో ఎన్నో చారిత్రక నిర్ణయాలు, మరెన్నో విప్లవాత్మక సంస్కరణలు అని చెప్పారు. ప్రజలే కేంద్రంగా సాగిన తెలంగాణ సంస్కరణల పథం యావత్ భారతావనికే ఓ పరిపాలనా పాఠమని తెలిపారు. ప్రతి నిర్ణయం పారదర్శకమని, ప్రతి మలుపులో జవాబుదారితనమి, ప్రతి అడుగులో ప్రజల భాగస్వామ్యం అంటూ ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. సీఎం కేసీఆర్ ఈ దశాబ్ద కాలంలో చేపట్టిన పాలనా సంస్కరణలు.. వచ్చే శతాబ్దికీ ఆచరించాల్సిన అడుగుజాడలని చెప్పారు. సంక్షేమ ఫలాలే కాదు, సంస్కరణల ఫలాలు కూడా ప్రజలందరికీ అందించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కి మాత్రమే సొంతమని పేర్కొన్నారు. మీకు పాలన చేతకాదు అని అన్నోళ్లే.. మన పాలనా సంస్కరణలు చూసి మనసారా మెచ్చుకుంటున్న అరుదైన తరుణం ఇదని, తమ గుండెలనిండా దీవిస్తున్న అపూర్వమైన సందర్భమని వెల్లడించారు. విద్యుత్ దీపాలతోనే కాదు.. విద్యతో కూడా ప్రతి ఇంట్లో వెలుగులు నింపొచ్చన్న విప్లవాత్మకమైన సంస్కరణలు, విద్యారంగాన్ని తీర్చిదిద్దే వినూత్న ఆలోచనలని చెప్పారు. పంచాయతీరాజ్ శాఖలో తెచ్చిన సంస్కరణలు పల్లె సీమలకు ప్రగతి రథ చక్రాలుగా నిలిచాయన్నారు. మున్సిపల్ శాఖలో అవినీతి మురికిని కడిగిపారేసిన సంస్కరణల పథం దేశంలోనే సరికొత్త అధ్యాయమని మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.

**ఆధునిక సంస్కరణలే పునాదిరాళ్లు..** శరవేగంగా పరుగులు పెడుతున్న మన తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు ఆధునిక సంస్కరణలే పునాదిరాళ్లని చెప్పారు. నాడు పరిశ్రమ రావాలంటే.. 'నీకెంత-నాకెంత' అనే దుర్మార్గపు విధానం ఉండేదని, నేడు పరిశ్రమ పెట్టాలంటే.. నువ్వు పెట్టే పెట్టుబడి ఎంత ?, మా తెలంగాణ యువతకు దక్కే ఉద్యోగాలెంత ?? అని అడుగుతున్నామన్నారు. టీఎస్-ఐపాస్ విధానంతో పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామమని తెలిపారు. భూమి చుట్టూ అల్లుకున్న సవాలక్ష చిక్కుముళ్లను విప్పేందుకు ప్రజల కోసం ప్రయోగించిన బ్రహ్మాస్త్రమే ధరణి అని వెల్లడించారు. దశాబ్దాలుగా పాలకుల గుప్పిట్లో బందీ అయిన అధికారాన్ని ప్రజల చేతికి అందించడమే పరిపాలనా సంస్కరణల పరమార్థమని చెప్పారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణ నుంచి నూతన కలెక్టరేట్ల నిర్మాణం వరకూ.. తండాలు, గ్రామపంచాయతీల నుంచి నూతన రెవెన్యూ డివిజన్లు, మండలాలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల వరకూ.. తెలంగాణలో సాగిన ప్రతి సంస్కరణ పథం.. భవిష్యత్ తరాలకు వెలకట్టలేని ఆభరణమని తెలిపారు.



**బాబాసాహెబ్ చూపిన బాటలో తెలంగాణ..** బాబాసాహెబ్ చూపిన బాటలో మన తెలంగాణ.. మనం తెచ్చుకున్నామని మంత్రి కేటీఆర్ అన్నారు. సుపరిపాలనలో స్పీడ్ పెంచేందుకు.. నూతన సచివాలయాన్ని కట్టుకున్నామని, దానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును సగర్వంగా పెట్టుకున్నామని చెప్పారు. ప్రపంచంలోనే ఎత్తయిన విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించుకున్నామని, సమున్నత విజ్ఞానమూర్తిని గుండెలనిండా గౌరవించుకున్నామని వెల్లడించారు. ఆయన ఆశయాలే స్ఫూర్తిగా.. సమగ్ర, సమీకృత, సమ్మిళిత, సమతుల్య అభివృద్ధే ఆలంబనగా సాగిన తొమ్మిదేండ్ల సుపరిపాలన ప్రస్థానంలో గ్రామ సచివాలయం నుంచి రాష్ట్ర సచివాలయం వరకూ భాగస్వాములైన ఉద్యోగులకు, యావత్ ప్రభుత్వ యంత్రాంగానికి.. సుపరిపాలన సైనికులందరికి పేరుపేరునా దశాబ్ది ఉత్సవాల సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రధానితో గొడవపడి మరీ తెలంగాణలో టెక్స్‌టైల్స్ పార్క్‌కు ఒప్పిస్తే.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం...

హైదరాబాద్: వరంగల్ టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించటం లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎంవోయూకు కేంద్రం సిద్ధంగా ఉన్నప్పటికీ.. తెలంగాణ సర్కార్ ముందుకు రావటం లేదని విమర్శించారు. ప్రధానమంత్రితో గొడవ పడి మరీ తెలంగాణలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు ఒప్పించానని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంతో మాత్రమే దేశంలోని రైతులకు లబ్ధి చేకూరుతోందని తెలిపారు. సబ్సిడీ రూపంలో ఎకరాకు 18వేల 600, కిసాన్ సమ్మాన్ నిధి రూపంలో ఆరు వేలు ఇస్తున్నామన్నారు. రెండు ఎకరాలు ఉన్న రైతుకు రూ.43 వేలు.. పది ఎకరాల రైతుకు లక్షా 92వేల రూపాయలు లబ్ధి చేకూరుతోందని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో సుమారు ఆరు శాతం రైతుల కోసం ఖర్చు చేస్తున్నామన్నారు. కేంద్రం నిర్ణయాలతో బియ్యం ఎగుమతులు పెరిగి.. నూనె దిగుమతులు తగ్గాయన్నారు. పత్తి పంటకు 75శాతం మద్దతు ధర పెంచామన్నారు. తెలంగాణలో ధాన్యం కొనుగోలు కోసం ఏడాది 26వేల 356కోట్లు కేంద్రం ఖర్చు చేస్తోందని



తెలిపారు. భారత బ్రాండ్ పేరుతో యూరియాను రైతులకు అందజేస్తున్నామని... మోదీ హయాంలో రైతులకు యూరియా పుష్కలంగా అందుబాటులో ఉందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# 11న కొత్తగూడెంలో సీపీఐ ప్రజా గర్జన.. లక్ష మందితో భారీ బహిరంగసభ

హైదరాబాద్: బీజేపీ కో హటావో.. దేశ్ కో బచావో పేరుతో నెల రోజులపాటు నిర్వహించిన ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఈ నెల 11న కొత్తగూడెంలో లక్ష మందితో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నది. సీపీఐ ప్రజా గర్జన పేరుతో కొత్తగూడెంలోని ప్రకాశం గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న ఈ సభలో కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటాల కొనసాగింపు, రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణను ప్రకటించనుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు చెప్పారు. జాతీయ, రాష్ట్ర రాజకీయాలు, పోరాటాలకు సంబంధించి నాయకులు దిశా నిర్దేశం చేస్తారన్నారు. ఈ సభకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ.రాజా, కార్యదర్శులు కే నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా, నాయకులు చాడా వెంకట్ రెడ్డి, పల్లా వెంకట్ రెడ్డి తదతరులు హాజరవుతారని వెల్లడించారు.




బొగొట (కొలంబియా): దక్షిణ అమెరికాలోని కొలంబియాలో గల దట్టమైన అమెజాన్ అడవుల్లో అద్భుతం జరిగింది. నిత్యం క్రూరమృగాలు సంచరించే ఈ కారడవిలో 40 రోజుల క్రితం తప్పిపోయిన నలుగురు చిన్నారులు ఎట్టకేలకు సజీవంగా కన్పించారు. ఓ విమాన ప్రమాదం నుంచి వీరు మృత్యుంజయులుగా బయటపడ్డారు. ఇందులో 11 నెలల పసిబిడ్డ కూడా ఉండటం విశేషం. అమెజాన్ అటవీ ప్రాంతం పరిధిలోని అరారాక్యూరా నుంచి శాన్‌జోస్ డెల్ గ్వావియారే ప్రాంతానికి మే ఒకటిన విమానం బయలుదేరింది. ఆ విమానంలో నలుగురు చిన్నారులు, వారి తల్లి, గైడ్, పైలట్ ఉన్నారని అధికారులు తెలిపారు. అయితే, విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఇంజిన్‌లో సాంకేతిక సమస్యతో అది కూలబోతున్నట్లు పైలట్ ప్రకటించాడు. అనంతరం ఆ విమానం రాడార్ నుంచి అదృశ్యమైంది. ప్రమాదం గురించి తెలుసుకున్న అధికారులు క్షతగాత్రులను కాపాడేందుకు సైన్యాన్ని రంగంలోకి దింపారు. 'ఆపరేషన్ హోప్' పేరిట దట్టమైన అడవుల్లో సహాయక చర్యలు ప్రారంభించారు. ఈ క్రమంలోనే ప్రమాదం జరిగిన రెండు వారాల తర్వాత మే 16న విమాన శకలాలను గుర్తించారు. అందులో పైలట్, చిన్నారులు తల్లి, గైడ్ మృతదేహాలను గుర్తించారు. అయితే విమానంలో 13, 9, 4 ఏళ్ల చిన్నారులు, 11 నెలల పసిబిడ్డ ఉన్నట్లు గుర్తించారు. ప్రమాద స్థలంలో వారు కన్పించకపోవడంతో చిన్నారుల కోసం గాలించారు. దాదాపు 150 మంది సైనికులు, జాగిలాలతో అమెజాన్ అడవిని జల్లెడపట్టారు. ఈ క్రమంలోనే మే 18వ తేదీన పిల్లలు క్షేమంగానే ఉన్నారని తెలియజేసేలా చిన్నగుడారం, జుట్టుకు కట్టుకునే రిబ్బన్, పాలసీసా, సగం తిన్న పండు వంటివి కనిపించాయి. దీంతో పిల్లలు అడవుల్లోనే ఉన్నట్లు ధ్రువీకరించిన అధికారులు వారి కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఎట్టకేలకు, ప్రమాదం జరిగిన 40 రోజుల తర్వాత చిన్నారులను సజీవంగా గుర్తించారు. గాలింపు బృందాలు వారి వద్దకు చేరుకునే సరికి నలుగురు పిల్లలు ఒంటరిగానే ఉన్నట్లు కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో తెలిపారు. ప్రస్తుతం వారికి వైద్య చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. అయితే క్రూరమృగాలు తిరిగే ప్రాంతంలో ఇన్ని రోజులుగా ఆ చిన్నారులు తమను తాము ఎలా కాపాడుకున్నారన్న వివరాలు ఇంకా తెలియరాలేదు.

గాలింపు సమయంలో భద్రతా సిబ్బంది అడవుల్లో అక్కడక్కడా హెలికాప్టర్ల సాయంతో ఆహార పదార్థాలు ఉన్న బాక్సులను పడేశారు. అవే ఆ చిన్నారులకు సాయం చేశాయని అధికారులు భావిస్తున్నారు. ఇన్ని రోజుల తర్వాత చిన్నారులు సజీవంగా కన్పించడంతో కొలంబియాలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. సైనికులతో చిన్నారులు ఉన్న దృశ్యాలను కొలంబియా మిలిటరీ ట్విటర్‌లో పోస్ట్ చేసింది. "మా ప్రయత్నాలు ఫలించాయి" అని రాసుకొచ్చింది. ప్రస్తుతం ఈ దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. "ఈ అడవే వారిని రక్షించింది. వారు అడవి పిల్లలు. మా కొలంబియాకు కూడా వారసులే" అని ఆ దేశ అధ్యక్షుడు పెట్రో సంతోషం వ్యక్తం చేశారు.

# వాళ్ల కోసం కొట్లాడుతా.. పోరాడుతా.. సాధిస్తా



సిద్దిపేట: దుబ్బాక పేరును విశ్వనగరంలో మారుమ్రోగించిన ఘనత జీనుప్యాంట్, రబ్బర్ చెప్పుల యువతదే అని ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. శనివారం దుబ్బాక పట్టణంలోని రజినీకర్ రెడ్డి ఫంక్షన్ హాల్ లో "సింధుభారతి ఫౌండేషన్" ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే నిర్వహించారు. అధిక సంఖ్యలో నిరుద్యోగ యువతీయువకులు జాబ్ మేళాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ.. తన గెలుపుకు ఎలా సహకరించారో యువతను కూడా తన కాళ్లమీద నిలబెట్టడమే లక్ష్యమన్నారు. కోడి గుడ్డు మీద ఈకలు పీకే వారి మాటలు ఎవ్వరూ పట్టించుకోవద్దని వ్యాఖ్యలు చేశారు. 500 రూపాయలతో సిద్దిపేటలో ఉపాధ్యాయునిగా పనిచేసి ఈ రోజు ఎమ్మెల్యే స్థాయిలో ఉన్నానని.. యువత కూడా అలాగే ఎదగాలని ఆకాంక్షించారు. జాబ్ మేళాలో ఎక్కడ అవకాశం వస్తే అక్కడ మొదటి అడుగు వేయాలన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో నిరుద్యోగాన్ని పారద్రోలడమే తన ప్రయత్నమని.. అందుకు అందరూ సహకరించాలని కోరారు. తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు తన శరీరంలో చివరి రక్తపు బొట్టు వరకు ప్రభుత్వంతో కొట్లాడుతా.. పోరాడుతా.. సాధిస్తా అని ఎమ్మెల్యే రఘునందన్ రావు స్పష్టం చేశారు.

# తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో మూడు దేవాలయాలకు మంత్రి హరీశ్‌రావు భూమిపూజ

సంగారెడ్డి : తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో శ్రీ మల్లికార్జున స్వామి, శ్రీ బీరప్ప స్వామి, విశ్వకర్మ దేవాలయాల నిర్మాణాలకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శరత్, మున్సిపల్ చైర్మన్ లలితా సోమిరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. మూడేండ్ల కృషితో బీరప్ప దేవాలయ నిర్మాణ కల నెరవేరబోతుంది అని హరీశ్‌రావు తెలిపారు. పార్టీలకు అతీతంగా దేశం మెచ్చిన నేతగా కేసీఆర్ చేస్తున్న సంక్షేమ పథకాలు అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. గొల్ల, కుర్మలకు ఐదు వందల కోట్ల విలువైన భూమిని అందించి ఆత్మగౌరవ భవనాలను నిర్మిస్తున్నాం అని తెలిపారు. విశ్వ బ్రాహ్మణుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. చేతి వృత్తులు చేస్తున్న బడుగు, బలహీన వర్గాలకు రూ. లక్ష అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. తెల్లాపూర్‌లో విశ్వ బ్రాహ్మణ దేవాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి రూ. 50 లక్షలు ప్రకటించటం అభినందనీయం అని హరీశ్ రావు అన్నారు. తెల్లాపూర్ మునిసిపాలిటీకి అన్ని సౌకర్యాలు, హంగులు సమకూర్చడంతో పాటు త్వరలోనే మునిసిపాలిటీ భవనం, వ్యవసాయ మార్కెట్, పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తామని మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారు.



# కాంగ్రెస్ కాలువలు తొవ్వి వదిలేస్తే.. బీఆర్ఎస్ నీళ్లిచ్చింది: మండలి చైర్మన్ గుత్తా

నల్లగొండ: విపక్ష నాయకులు చేస్తున్న పాదయాత్రలు ఆధిపత్య పోరు కోసం తప్ప ప్రజల కోసం కాదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డి , బండి సంజయ్ పాదయాత్రలు చేసి అలసిపోయారని విమర్శించారు. భట్టి విక్రమార్క పాదయాత్ర చేస్తున్న డిండి ప్రాంతంలోనే రెండు పంటలకు నీరు ఇచ్చింది కనపడడం లేదా అని నిలదీశారు. నల్లగొండలోని తన నివాసంలో మండలి చైర్మన్ గ్తు సుకేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీ (%ూాదీజ%) సొరంగంలో ఎన్నో సాంకేతిక సమస్యలతో నాలుగేళ్లుగా శ్రీశైలం నీటితో నిండుతున్నదని చెప్పారు. టన్నెల్ మరమ్మతులకు గురైతే ఆరు నెలలు ఆగాల్సి వస్తున్నదని, సొరంగం తవ్వకం పనులు ఇంకా 9 కిలోమీటర్లు మిగిలి ఉన్నాయని తెలిపారు. డిండి ఎత్తిపోతల పథకాల్లోని ప్రాజెక్టులు పూర్తి కావస్తున్నాయని, ప్రభుత్వం ఇప్పటికే రూ.2 వేల కోట్లకుపైగా నిధులు ఖర్చు చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో కాలువలు తవ్వి వదిలిస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం నీళ్లు తెచ్చిందని చెప్పారు. ఏఎమ్మార్పీ పూర్తిచేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదన్నారు. హైదరాబాద్‌లో మీ ఇంటికి కూడా నీళ్లు వచ్చాయనేది మర్చిపోవద్దని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజశేఖర్ రెడ్డి వల్లె పంచ, దోతి కట్టడం తప్ప.. భట్టి విక్రమార్కకు మధిర నియోజకవర్గం తప్ప ఏదీ తెలియదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ తొమ్మిదేండ్ల పాలనలో జిల్లాలో జరిగిన అభివృద్ధి తాము చేసిన ప్రగతికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీలో సీఎం అభ్యర్థులు ఎవరో తెలియదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్ని కలలు కన్నా ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని స్పష్టం చేశారు.



# గోల్కొండ బోనాలకు ప్రత్యేక విశిష్టత: మంత్రి తలసాని

హైదరాబాద్: హైదరాబాద్‌లో ఆషాఢ బోనాల జాతర ఈ నెల 22న ప్రారంభం కానుంది. నెలరోజులపాటు జరిగే ఈ ఉత్సవాలు గోల్కొండ కోటలోని జగదాంబికా మహంకాళి (ఎల్లమ్మ) అమ్మవారికి తొలిబోనంతో మొదలుకానున్నాయి. ఈ నేపథ్యంలో బోనాల ఏర్పాట్లపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గోల్కొండ కోట వద్ద అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా.. గోల్కొండ బోనాలకు ఎంతో విశిష్ఠత ఉన్నదని చెప్పారు. ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరుచేసిందన్నారు. ఈ నెల 22 నుంచి ఆషాఢ బోనాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉత్సవాలను నామమాత్రంగానే నిర్వహించారని వెల్లడించారు. గోల్కొండలో మొదలయ్యే బోనాల జాతర.. జూలై 9న సికింద్రాబాద్ మహంకాళి బోనాలు, 10న రంగం నిర్వహించనున్నారు. వచ్చే నెల 16న ఓల్డ్ సిటీ బోనాలు, 17న ఉమ్మడి దేవాలయాల ఆధ్వర్యంలో ఉంటుంది. ఈ ఏడాది బోనాల ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం రూ.15 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే.



Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com